
Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి :1 | సంచిక: 154 | హైదరాబాద్ | బుధవారం | 14 -02 - 2024 | పేజీలు: 8 | రూ.4/-




## త్వరలో విధ్వంస
# జలదృశ్యం





- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- టిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఉద్దేశించి రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేపిన తాజా ట్వీట్
- ఆహ్వానించినా బిఆర్ఎస్, బిజెపి రాలేదన్న మంత్రులు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** విధ్వంస మైన జలదృశ్యాన్ని కల్లారా చూడబోతున్నామంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ వైరల్ అయ్యింది. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ట్వీట్ వైరల్ గా మారింది. మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరి వెళ్ళిన విషయం తెలిసిందే.రేవంత్ రెడ్డి బృందం మేడిగడ్డకు చేరుకున్న క్రమంలో బీఆర్ఎస్ అధి నేత కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన ట్వీట్ వైరల్ అ య్యింది. కేసీఆర్ ధనదాహానికి కాళేశ్వరం ప్రాజెక్టు బలైందని, మర మ్మతులకు కూడా పనికిరాదని వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరంపై చిందు లుతొక్కిన బీజేపీ, వాస్తవా లు చూడడానికి రావడం లేదని సీఎం రేవంత్ విమర్శించారు.సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్ సారాంశం ఇలా ఉంది. తెలంగాణ ప్రజల కష్టార్జితంతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ధన దాహానికి బలైంది. రూ. 97 వేల కోట్లు వ్యయం చేసి కనీసం 97 వేల ఎకరాల కు కూడా నీళ్లివ్వలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రాజెక్టు డిజైన్ నుంచి నిర్మాణం వరకు అన్నీతానై కట్టానని చెప్పిన కేసీఆర్, మేడిగడ్డ కూలి నెలలు గడుస్తున్నా నోరు విప్పడం లేదు. మేడిగడ్డ మరమ్మతులకు పనికి రాదు. పూర్తిగా పునర్ నిర్మాణం చేయాల్సిందేనని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అభిప్రాయపడింది.ఈ నేపథ్యంలో వాస్తవాలు తెలంగాణ సమాజానికి తెలిపే ప్రయత్నం ప్రజా ప్రతినిధుల నేటి మేడిగడ్డ పర్యటన.

వివరాలు 2లో

# నీళ్ల కోసం చావోరేవో: కేసీఆర్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** కృష్ణా జలాల కోసం చావో రేవో తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైందని మాజీ ముఖ్యమంత్రి, బీఅర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పిలుపునిచ్చారు. నీళ్లు లేకపోతే బతుకు లేదని చెబుతూ, కృష్ణా జలాల కోసం మరో పోరాటం చేయాలన్నారు. నల్లగొండ శివారులోని మర్రిగూడ బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన 'చలో నల్లగొండ' బహిరంగ సభలో మాట్లాడారు.జై తెలంగాణా అంటూ ప్రసంగం మొదలు పెట్టిన కేసీఆర్ మీరు అనుమతిస్తే, కూర్చుని మాట్లాడతానంటూ సభికులను కోరారు. ఆ తర్వాత కూర్చునే ఆయన ప్రసంగాన్ని కొనసాగించారు. 'కొందరు సన్నాసులు ఈ సభ తమకు వ్యతిరేకం అనుకుంటున్నారు. కానీ ఇది రాజకీయ సభ కాదు. పోరాట సభ. నీళ్ల కోసం ఉవ్వెత్తున మనం ఎగసిపడకపోతే ఎవరూ మన రక్షణకు రారు. బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు, కేంద్ర మంత్రులకు, మన నీళ్లను ఎత్తుకుపోయేవారికీ ఈ సభ ఒక హెచ్చరిక. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ఇది జీవన్మరణ సమస్య. కాలు విరిగినా, కట్టె పట్టుకుని ఎందుకు వచ్చానంటే, ఈ సమస్య తీవ్రతను గుర్తించే. నల్లగొండ జిల్లాలో లక్షా యాభై వేల మంది ఫ్లోరోసిస్ బాధితులు ఉండేవారు. అప్పట్లో ఫ్లోరైడ్ ఉద్యమ నేతలతో కలసి కొందరు ఫ్లోరైడ్ బాధితులను ఢిల్లీ తీసుకువెళ్లి, ప్రధానమంత్రి టేబుల్ మీద పండబెట్టి ఇవీ మా బతుకులంటే ఎవరూ పట్టిచుకోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక నల్లగొండను జీరో ఫ్లోరైడ్ చేసింది. తెలంగాణాకు నేనేమీ తక్కువ చేయలేదు. నిమిషం కూడా కరెంటు పోకుండా చూశాను. ప్రతి ఇంట్లో నల్లా పెట్టి మంచినీళ్లు అందించాను. నల్లగొండలో లక్షల టన్నుల వడ్లు పండించే స్థితికి తీసుకొచ్చాను' అని కేసీఆర్ చెప్పారు.

### పాలిచ్చే బర్రెను వదిలి, దున్నపోతును తెచ్చుకున్నారు

కృష్ణా జలాలపై మాట్లాడుతూ ట్రిబ్యునల్ వేసేందుకు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తే, వందలాది ఉత్తరాలు రాశామనీ, వారం రోజులపాటు లోక్ సభలో కార్యకలాపాలు

వివరాలు 2లో

## ఒక అమ్మ..
## అనేక ఎర్ర తివాచీలు!



**తెలంగాణ వీణ/హైదరాబాద్ బ్యూరో:** కాంగ్రెస్ పార్టీ అంటేనే సోనియా గాంధీ కుటుంబం పట్ల భక్తికి నిలువెత్తు రూపం. ఆ పార్టీలో చిన్న పెద్ద నాయకులు ప్రతి ఒక్కరూ కూడా సోనియా కుటుంబం పట్ల భక్తిని ప్రదర్శించడం లో పునీతం అవుతుంటారు. సోనియా మీదుగానీ మీ కుటుంబ సభ్యుల మీది గాని ఈగ వాలనివ్వకుండా చూసుకుంటూ ఉంటారు.అలాంటి సోనియా పట్ల తమ అనన్యమైన భక్తిని ప్రదర్శించడానికి ఇప్పుడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ శాఖలకు ఒక మహదవకాశం కలిసి వచ్చింది. దేశంలో రాజ్యసభ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో.. తమ రాష్ట్రం నుంచి పోటీ చేయాలంటే తమ రాష్ట్రం నుంచే పోటీ చేయాలి అంటూ అందరూ పోటీపడుతున్నారు.

వివరాలు 2లో

## మీతోనే అరబ్ భారత్ బంధం మరింత విశిష్టం

- యుఎఇ భారత సంతతితో అహ్లాన్ సభలో మోడీ



**తెలంగాణ వీణ/హైదరాబాద్/అబుధాబి :** అరబ్ దేశాలలో భారతీయ సంతతి కీలక పాత్ర భారతదేశానికి గర్వకారణం అని ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. యుఎఇ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ మంగళవారం 'అహ్లాన్ మోడీ' పేరిట ఏర్పాటు అయిన ఇష్టాగోష్టిలో ముచ్చటించారు. అరబీ భాషలో అహ్లాన్ మోడీ అంటే హాలో మోడీ అనే పలకరింపు. ఈ ఆత్మీయసమ్మేళన సభకు వేలాది మంది భారతీయ సంతతి వారు కుటుంబాలతో తరలివచ్చారు. యుఎఇ భారత్ స్నేహ సంబంధాలను మరింతగా కీర్తించుకుంటూ ముందుకు సాగాల్సిన సమయం ఇదేనని, ఇక్కడి భారతీయ సంతతి దేశానికి గర్వకారణం అని అభినందించారు.

వివరాలు 2లో



# ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఒకే ఒక్క సీటు!

### - సీట్ల పొత్తులో ఆప్ బంపర్ ఆఫర్

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన సీట్ల పంపకాలపై ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షాలైన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), కాంగ్రెస్ పార్టీల మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకునే అవకాశం కనపడుతోంది. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ నియోజకవర్గాలలో కేవలం ఒక్కంటే ఒక్క స్థానాన్ని మాత్రమే కాంగ్రెస్ పార్టీకి కేటాయిస్తామని ఆప్ తెగేసి చెప్పింది. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్‌తో గత కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. అయితే ఆప్ ఎంపి సందీప్ పాఠక్ కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య సీట్ల పంపకాలు సాధ్యమయ్యేనా అన్న అనుమానాలకు తావిస్తున్నాయి.ప్రతిభ ప్రాతిపదికన చూస్తే కాంట్రెస్‌కు ఢిల్లీలో ఒక్క సీటును కూడా పొందే అర్హత లేదు. కాని పొత్తు ధర్మాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ పార్టీకి ఢిల్లీలో ఒక సీటు ఇస్తాం. కాంగ్రెస్ పార్టీ ఒక సీటులో, ఆప్ ఆరు సీట్లలో పోటీ చేయాలని మేము ప్రతిపాదిస్తున్నాము అంటూ పాఠక్ వ్యాఖ్యానించారు. కాగా..గతంలో ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో మెజారిటీ అసెంబ్లీ స్థానాలను ఆప్ కైవసం చేసుకోవడంతో పొత్తు చర్చల్లో ఆప్‌దే పైచేయిగా ఉంది. అయితే దేశ రాజధానిలో వరుస అపజయాలను చవిచూసిన కాంగ్రెస్ తన పూర్వ వైభవాన్ని సాధించుకోవడానికి ప్రయత్నిస్తోంది. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఢిల్లీలో ఒక్క సీటును కూడా కాంగ్రెస్ గెలుచుకోలేకపోయింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో మొత్తం 250 స్థానాలలో 9 స్థానాలను మాత్రమే కాంగ్రెస్ గెలుచుకుంది. ఇలా ఉండగా. లోక్‌సభ ఎన్నికకు సంబంధించిన .సీట్ల పొత్తుపై జరిగిన ప్రాథమిక చర్చలలో 4:3 సూత్రాన్ని కాంగ్రెస్ ప్రతిపాదించింది. కాంగ్రెస్ 4 స్థానాలలో, ఆప్ 3 స్థానాలలో పోటీ చేయాలని కాంగెస్ ప్రతిపాదిచింది. అయితే పాఠక్ ప్రకటన ప్రకారం ఉభయ పక్షాలకు సంతృప్తిని కలిగించే ఏకాభిప్రాయం కుదరలేదన్న సూచనలు కనపడుతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలలో ఢిల్లీలోని మొత్తం 7 స్థానాలను బిజెపి కైవసం చేసుకోగా కాంగ్రెస్, ఆప్‌లకు మొండి చెయ్యి మిగిలింది. ఇండియా కూటమిలోని మిత్ర పక్షాల మధ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆప్ నుంచి ఈ ప్రతిపాదన రావడం గమనార్హం.పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాలలో తామే పోటీ చేస్తామని అధికార ఆప్ ప్రకటించడంతో కాంగ్రెస్ కూడా ఒంటరి పోరుకే సిద్ధపడుతోంది. పంజాబ్‌లో 13 లోక్‌సభ స్థానాలు ఉండగా చండీగఢ్‌లో ఒక స్థానం ఉంది. మొత్తం కలిపితే 14 స్థానాలు అవుతాయి. ఈ 14 స్థానాలకు ఆప్ తన అభ్యర్థులను ప్రకటిస్తుందని, ఈ 14 స్థానాలలో ఆప్ అభ్యర్థులు గెలుపొందే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని గత

వివరాలు 2లో

# రెండు పార్టీలవి జిమ్మికులు: కిషన్ రెడ్డి...



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీనదిలో వేసినట్టేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పార్లమెంట్ సీటును తాము గెలుస్తామని జోస్యం చెప్పారు. దేశంలో బలమైన నాయకత్వం బిజెపికే ఉందని, కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా గెలుపు బిజెపిదేనని స్పష్టం చేశారు. లోక్ సభ ఎన్నికలలో తెలంగాణలో బిజెపి ఎక్కువ సీట్లు గెలుస్తుందని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో పార్లమెంట్ ఎన్నికలలో విజయం సాధించి మూడో సారి ముచ్చటగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు.

## త్వరలో విధ్వంస జలదృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను కూడా ఆహ్వానించాం. బీఆర్ఎస్‌తో పాటు వారి చీకటి మిత్రులు బీజేపీ శాసనసభ్యులు మేడిగడ్డకు రావడం లేదు. చంద్రశేఖర్ రావుకు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ప్రధాని మొదలు గల్లీ లీడర్ వరకు లొల్లి చేసే బీజేపీ నాయకులు వాస్తవాలు చూడడానికి క్షేత్రస్థాయికి రావడం లేదు. అన్నీ పార్టీల శాసన సభ్యులు ఒకవైపు ఉంటే బీజేపీ, బీఆర్ఎస్ మాత్రం ఒకటిగా ఒకవైపు ఉన్నాయి. మేడిగడ్డ పర్యటనతో తెలంగాణ సమాజం తొమ్మిదిన్నరేళ్లు కేసీఆర్ పాలనలో విధ్వసమైన జలదృశ్యాన్ని కళ్లారా చూడబోతోంది అంటూ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు కాం గ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరి వెళ్లి ఇప్పటికే ప్రాజెక్టు పరిశీలనలో ఉంది రేవంత్ రెడ్డి బృందం.పిల్లర్లను క్షుణ్ణంగా పరిశీలించిన బృందం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ పైన 20, 21 పిల్లర్లపై భాగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. తర్వాత బ్యారేజి కింది భాగం గోదావరి నదిలోకి వెళ్లి బ్యారేజీలో నిర్మించిన 20, 21 పగుళ్లు బారిన పడిన పిల్లర్లను ను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు.కుడివైపుకు చేరుకొని బ్యారేజీలో కుంగిపోయిన కింది భాగాన్ని కృంగిపోయిన పిల్లలను చూశారు. వివరాలను నీటిపారుదల శాఖ అధికారులు సీఎంకు వివరించారు. ఆయన వెంట రాష్ట్ర ఐటీ పరి శ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో పాటు పలువురు మంత్రులు శాసనసభ్యులు ఉన్నారు.ఇది ఇలా ఉండగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ గ త ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ. లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని మండిపడ్డారు. తప్పు జరిగింది కాబట్టే బిఆర్ఎస్ నేత లను మేము అహ్వానించినప్పటికి ముఖం చాటేసారని ఎద్దేవా చేశా రు. వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయనే రాలేదని వ్యాఖ్యానించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ లో ఎన్నో లోపాలు ఉన్నాయని అన్నారు. డిజైన్ లోపాల గురించి ఆనాడే తాను కేసీఆర్‌కు చెప్పానని గుర్తు చేశారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ ప్రధానమైనదని, మేడిగడ్డ బ్యారేజీలో నీరు నిలుస్తేనే ఎక్కడికైనా ఎత్తిపోయొచ్చని అన్నారు.కానీ పరిస్థితి అలా లేదని మిగతా జలాశయాలకు ఎలా ఎత్తిపోస్తారని ప్రశ్నించారు. కాగా మేడిగడ్డ సందర్శనకు రావాలని పార్టీలకతీతంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యేలను అందరినీ ఆహ్వానించారు కానీ టిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు గైరాసరయ్యారన్నారు.

## ఒక అమ్మ.. అనేక ఎర్ర తివాచీలు!

(మొదటి పేజీ తరువాయి)

రాయబరేలి స్థానం నుంచి ప్రస్తుతం లోక్ సభ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సోనియాగాంధీ.. ప్రజల ఓట్ల ద్వారా ఎన్నికయ్యే ట్రాక్ నుంచి తప్పుకుని రాజ్యసభలోకి అడుగుపెట్టి సందర్భం దగ్గర పడినట్లుగా ఉంది. ఈ రాజ్యసభ ఎన్నికల్లో బడిలో ఉండి ఎంపీ అవుతారని.. తమ కుటుంబానికి అచ్చి వచ్చిన రాయి బరేలి స్థానం నుంచి వచ్చే లోకసభ ఎన్నికలలో ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని ఒక ప్రచారం జరుగుతుంది. అయితే కాంగ్రెస్ పార్టీ అమ్మ సోనియా గాంధీ చేయడానికి అనేక రాష్ట్రాలు ఉత్సాహ పడుతున్నాయి. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటి అనేక రాష్ట్రాన్ని సోనియమ్మకు ఎర్రతివాచీ పరిచి తమ రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నాయి. తమ రాష్ట్రం నుంచి ఒకే ఎంపీకి అవకాశం ఉన్న రాష్ట్రాలు కూడా.. ఆ ఒక్క సీటును సోనియమ్మకు కట్టబెడతాం అంటున్నాయి. తెలంగాణలో అయితే.. ఆమె లోక్ సభలో పోటీ చేసినా గెలిపిస్తామని ఆల్రెడీ అనేక ఆఫర్లు ఇచ్చారు. తీర్మానాలు చేశారు. లోక్ సభ అఫర్లకు తోడుగా.. రాజ్యసభకు పంపుతాం అంటూ రెడ్ కార్పెట్ పరుస్తున్నారు.ఆహ్వానాలు ఎన్ని ఉన్నప్పటికీ.. రాజస్థాన్ నుంచి రాజ్యసభలో అడుగు పెట్టడానికి సోనియాగాంధీగా సుముఖంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతమంది ఆహ్వానించడం చూస్తుంటే.. కాంగ్రెసులో సోనియమ్మ భక్తి ఇసుమంత అయినా సడలలేదని అనిపిస్తోంది.

## మీతోనే అరబ్ భారత్ బంధం మరింత విశిష్టం

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక జాయెద్ స్పోర్ట్ సిటి స్టేడి యంలో కార్యక్రమం జరిగింది. మోడీ రాగానే సభికులు పెద్ద ఎత్తున నమస్కార్, మోడీ మోడీ నినాదాలకు దిగారు.తన పట్ల ఇక్కడి తనవారు చూపిన భావోద్వేగం తనను కదిలించివేసిందని మోడీ చెప్పారు. ఇంత మంది ఇక్కడికి తరలివచ్చారు. ఆనందంగా ఉంది. ఇక్కడికి యుఎఇలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారిలో భారతదేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. అయితే వీరందరి గుండెస్పందన అనుసంధానం ఒక్కటే అని మోడీ స్పందించారు. ఇదో చారిత్రక స్టేడియం, ఇక్కడ ఇరుదేశాల నడుమ బలోపేత బంధం గురించి ఇప్పుడు ఇంతమంది నడుమ మరోసారి వెనోళ్ల ప్రకటించుకోవల్సి ఉందన్నారు.ఉభయదేశాల జాతీయ గీతాలాపనలతో ఈ కార్యక్రమం ఆరంభమైంది. ఇక్కడి ప్రతి వ్యక్తి గుండెస్పందన లయాన్వితంగా పలికేది ఒక్కటే భారత్ యుఎఇ స్నేహం విలసిల్లాలి అనేదే అని తెలిపారు. తాను ఇక్కడి ఇంతమంది భారతీయులతో కలిసినప్పుడు తన కుటుంబ సభ్యుల వద్దకు వచ్చినంత ఆనందంగా ఉందని, 140 కోట్ల మంది భారతీయుల తరపున సోదరసోదరీల దూతగా తాను ఇక్కడికి వచ్చినట్లు, వారి సందేశం ఇక్కడి సంతతివారికి అందిస్తున్నట్లు తెలిపారు. గడిచిన పదిసంవత్సరాలలో తాను యుఎఇ పర్యటనకు రావడం ఇది ఏడోసారి అని వివరించారు.

# నీళ్ల కోసం చావోరేవో: కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

జరగనియ్యలేదనీ చెప్పారు. ఆ ఒత్తిడికి తలవొగ్గి ట్రిబ్యునల్ వేశారని కేసీఆర్ చెప్పారు. 'అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా ట్రిబ్యునల్ ముందు గట్టిగా వాదించి మన అవసరాలు చెప్పి, మా వాటా ఇంత రావాలని కొట్లాడాలి. మగాడు చేయాల్సిన పని అది. ఇప్పటి ప్రభుత్వం కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగిస్తూ అప్పనంగా సంతకం పెట్టేసింది. ఆ వెంటనే హరీశ్ రావు గర్జించాడు. నాలుగైదు రోజులు అబద్ధాలాడారు. బడ్జెట్ పై చర్చను పక్కనబెట్టి తీర్మానం చేశారు. అయినా తప్పు చేశారు. తీర్మానంలో సాగు, తాగు నీళ్ల గురించి చెప్పారే గానీ కరెంటు ఉత్పత్తి గురించి పేర్కొనలేదు. మరి మీకేం కోపం వచ్చిందో గానీ పాలిచ్చే బర్రెను వదిలి, దున్నపోతును తెచ్చుకున్నారు' అని జనాన్ని ఉద్దేశించి అన్నారు.

### 'దద్దమ్మల రాజ్యంలో అట్లనే ఉంటది'

'అధికారంలోకి వచ్చిన కొత్త గవర్నమెంట్ ఏం చేయాలి? పోయిన గవర్నమెంటు కన్నా నాలుగు మంచి పనులు చేయాలి. కాని ఈ ప్రభుత్వం ఒక్కటన్నా మంచి మాట చెబుతోందా? పొద్దున లేస్తే కేసీఆర్ ను తిట్టాలి. కేసీఆర్ ని తిడితే పెద్దోళ్లవుతారా? అసెంబ్లీలో ఎలా దుర్భాషలాడుతున్నారో చూస్తూనే ఉన్నారు కదా? అధికారం ఉన్నా లేకున్నా తెలంగాణా ప్రజల పక్షాన పోరాడతాం. అప్పట్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఏడెనిమిది నెలల తర్వాత 24 గంటల కరెంటివ్వడం మొదలుపెట్టాం. కేసీఆర్ పోగానే కరెటు బందయింది. మరి కరెంటుకు ఏం రోగమొచ్చింది? దద్దమ్మల రాజ్యం ఉంటే అట్లనే ఉంటది. చవటల రాజ్యం ఉంటే అట్లనే ఉంటది' అన్నారు. అసెంబ్లీలోనే ఈ ప్రభుత్వం జనరేటర్ పెట్టిందని ఎద్దేవా చేస్తూ, జనమంతా మా కరెంట్ ఏమైందని అడగాలని కేసీఆర్ సూచించారు.ఈ ప్రభుత్వానికి రైతు బంధు ఇవ్వడానికి కూడా చేతకావట్లేదని అన్నారు. ఇవ్వకపోతే ఇవ్వకపోయారు, రైతు బంధు అడిగితే అన్నదాతని చెప్పుతో కొట్టండని అంటున్నారని చెబుతూ చెప్పులు రైతులకు కూడా ఉంటాయని ఆయన అన్నారు. తాము రైతుల అకౌంట్లలో రైతు బంధు నిధులు వేసిన వెంటనే వాళ్ల ఫోన్లలో సమాచారం టింగు టింగుమని వచ్చేదని, ఇప్పుడు నిధులూ లేవు, టింగుటింగుమని ఫోన్లు మోగడమూ లేదని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ ని బయట తిరగనియ్యమని అంటున్నారు. మీరు అంత మొగాళ్లా? తెలంగాణా తెచ్చిన కేసీఆర్ నే తిరగనియ్యరా? చంపేస్తారా.. రండి చూద్దాం' అని కేసీఆర్ సవాల్ విసిరారు.కొత్తగా వచ్చిన ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతలన పూర్తి చేయాలి. ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలి. గురుకులాల సంఖ్య పెంచాలి. మంచినీళ్లు, కరెంటు మంచిగా ఇవ్వాలని ఆలోచించాలనీ, ఆ విషయాలు పక్కనపెట్టి, రాజకీయాలు చేస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు.

### మేమూ మేడిగడ్డకు పోతాం

మేడిగడ్డకు వెళ్లిన కాంగ్రెస్, ఇతర పార్టీలవారిని ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడుతూ 'మేడిగడ్డకు ఎందుకు పోతున్నారు? కాళేశ్వరం ప్రాజెక్టంటే ఆటబొమ్మ అనుకుంటున్నారా? అది భారీ ప్రాజెక్టు. 250 నుంచి 300 పిల్లర్లు ఉంటాయి. అందులో ఒకటో రెండో పిల్లర్లు కుంగాయని రాజకీయం చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టులో పిల్లర్లు కుంగలేదా? కడెం ప్రాజెక్టు గేట్లు, మూసీ ప్రాజెక్టు గేట్లు గతంలో దెబ్బతినలేదా? ప్రాజెక్టులో ఉన్న నీళ్లను ఎత్తిపోసే ఆలోచనను పక్కనబెట్టి రాజకీయాలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత మేమూ మేడిగడ్డకు వెళ్తాం' అని కేసీఆర్ అన్నారు.

### పులిలా లేచి కొట్లాడతా

'ఇది మునుపటి ఎడ్డి తెలంగాణా కాదు. టైగర్ తెలంగాణా. నా కట్టెకాలేవరకూ తెలంగాణాకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోను. పులిలా లేచి కొట్లాడతా. మీ అందరినీ కోరేదొకటే, పోరాటానికి సిద్ధంగా ఉండాలి. అవసరమైతే సద్దులు కట్టుకుని రావాలి. పిడికిలి బిగించాలి. ఈ మాట చెప్పేందుకే ఇంత దూరం వచ్చాను. మళ్లీ డబుల్ స్పీడ్ తో అధికారంలోకి వస్తాం' అన్నారు.

## కాళేశ్వరం అక్రమాలపై తెలంగాణ సీబీఐ విచారణను ఎందుకు కోరడం లేదు: బండి సంజయ్



**తెలంగాణ వీణ/కరీంనగర్:** ఇంజినీర్లు ఎప్పుడో కాళేశ్వరం వెళ్లి నివేదికను అందించారని అలాంటప్పుడు సీఎం రేవంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి మళ్లీ మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించాల్సిన అవసరం ఏమి వచ్చింది? అని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డ సందర్శనకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బండి సంజయ్ మాట్లాడుతూ మళ్లీ కాళేశ్వరం వెళ్లవలసిన అవసరం ఏమొచ్చిందన్నారు.మంత్రులు, ఇంజనీర్లు ఎప్పుడో కాళేశ్వరం వెళ్లి నివేదిక ఇచ్చారు కదా అని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణను ఎందుకు కోరడం లేదో చెప్పాలన్నారు. కృష్ణా నీటి పేరుతో బిఆర్ఎస్, కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ డ్రామాలు ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముక్కు నేలకు రాసి బిఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను గాలికి వదిలేసిందని అందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ విలువైన సమయాన్ని వృథా చేస్తారా? అని నిలదీశారు. తెలంగాణ ప్రజల కోసం బిజెపి కొట్లాడుతోందని కేంద్రం నిధులు ఇస్తోందని అలాంటప్పుడు కాంగ్రెస్‌కు ఓట్లు వేయడం న్యాయమా? అన్నారు.

## మేడిగడ్డ ఒక ఫెయిల్యూర్ ప్రాజెక్ట్: మంత్రి ఉత్తమ్



**తెలంగాణ వీణ/మంథని:** జయశంకర్ భూపాలపల్లి: స్వాతంత్ర భారతదేశం లో ఇంత పెద్ద కుంభకోణం ఇంకోటి లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంఎల్ఎల బృందం కాళేశ్వరంలో పర్యటించి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 94 వేల కోట్ల ఖర్చుతో 90 వేల ఎకరాలకు నీళ్ళించారని, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రాజెక్ట్ కట్టారని, 38 వేల కోట్ల ప్రాజెక్ట్ ను రీడిజైన్ పేరుతో 94 వేల కోట్ల ఖర్చు పెట్టారని ధుయ్యబట్టారు. ఇంకా 30 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్ట్ పూర్తి అవుతుందని, బ్యారేజ్ కట్టి నీటిని నిల్వ చేసి ఎన్నికల ముందు పబ్లిసిటీ చేసుకున్నారని మండిపడ్డారు. ఇది భారీ కుంభకోణమని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. అక్టోబర్ 21న ప్రమాదం జరిగితే ఈ రోజు వరకు కూడా కెసిఆర్ ఒక్క మాట మాట్లాడలేదని, నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు ముందే చెప్పారని, మేడిగడ్డ ప్రాజెక్ట్ ఒక ఫెయిల్యూర్ ప్రాజక్ట్ అని తెలిపారని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. పూర్తి సమాచారంతో డ్యాం సేఫ్టీ అధికారుల సూచనలతో ముందుకు పోతామని పేర్కొన్నారు. 94 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృదా చేసి నామ మాత్రపు కొత్త ఆయకట్టు తయారు చేశారు.

## ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఒకే ఒక్క సీటు!

(మొదటి పేజీ తరువాయి)

శనివారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒక ర్యాలీలో పిలుపునిచ్చారు. హర్యానా, గోవా వంటి రాష్ట్రాలలో కూడా తమకు సీట్లు కేటాయించాలని ఆప్ డిమాండు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్, ఆప్ మధ్య సీట్ల పొత్తు చర్చలు జఠిలమవుతున్నాయి. తన విజయావకాశాలను నీరుగార్చుకోవడం ఇష్టం లేని కాంగ్రెస్ ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తోంది.

## మేమొస్తే ఎంఎస్‌పికి చట్టబద్ధత తొలి గ్యారంటీ

**- రైతుల ఆందోళనకు మద్దతు: కాంగ్రెస్**




**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** రైతులు తమ పంటలకు న్యాయసమ్మతమైన డిమాండ్లతో ముందుకు సాగుతున్నారని, వీరిని దమననీతితో కేంద్ర ప్రభుత్వం అడ్డుకొంటోందని కాంగ్రెస్ పార్టీ మంగళవారం విమర్శించింది. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతుల న్యాయబద్ధమైన డిమాండ్లకు అంగీకారం తెలిపితీరుతామని, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధమైన గ్యారంటీ కల్పిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హిందీలో సామాజిక మాధ్యమంలో స్పందించారు. రైతుల యాత్ర కేవలం ఆరంభమే అని, ఇది వారి సమస్యల పరిష్కారం వరకూ ఆగబోదని కాంగ్రెస్ తెలిపింది.రైతులు పండించే వివిధ రకాల పంటలకు తప్పనసరిగా గిట్టుబాటు ధరలు అందాల్సిందే అని, ఇది న్యాయసమ్మతం అని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఈ అంశంపై స్పందిస్తూ రైతులకు పార్టీ పూర్తి స్థాయి మద్దతు ఉంటుందని తెలిపారు, ఇకనైనా ప్రధాని మోడీ భేషజాలు వీడి రైతుల నేతలతో నేరుగా చర్చలు జరిపితీరాలని, వారికి న్యాయం జరిగేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. రైతుల ఢిల్లీ చలో చారిత్రక ఘట్టం అని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలిగా ప్రకటించేది కిసాన్‌న్యాయ్ గ్యారెంటీ అని రాహుల్ వెల్లడించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాలలో సాధించింది ఏమీ లేదని , రైతులకు వాగ్దానభంగంతోనే పొద్దుగడిపిందని విమర్శించారు.

## కనీస మద్దతు ధర చట్టం తక్షణమే అసాధ్యం

**- కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా**



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** పంటలకు కనీస మద్దతు ధర చట్టం తక్షణ రీతిలో తీసుకురావడం అసాధ్యం అని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. రైతుల చలోఢిల్లీ నేపథ్యంలో మంగళవారం ఆయన ఈ విషయంపై స్పందించారు. ఏదైనా కీలక విషయంపై చట్టం తీసుకురావాలంటే సంబంధిత భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు అవసరం, ఇందుకు సమయం పడుతుంది. దీనిని కాదని వెనువెంటనే ఎంఎస్‌పి చట్టం తీసుకురావడం కుదరదు కదా అని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తమ సమస్యల గురించి కేంద్ర ప్రభుత్వంతో నిర్మాణాత్మక స్థాయి చర్చలకు దిగాలని కోరారు.రైతులు ఈ దశలో ఒక్క విషయం గుర్తుంచుకోవాలి, కొన్ని శక్తులు తమ రాజకీయ స్వీయ ప్రయోజనాలకు ఈ రైతుల నిరసనల ఘట్టాన్ని వాడుకుని, వారిని అప్రతిష్టపాలు చేయడానికి సంకల్పించాయి. రైతు ప్రతినిధులు గుర్తించాలని తెలిపారు. ఇటువంటి శక్తుల పట్ల జాగ్రత్తలు అవసరం అని హెచ్చరించారు. వారి కుట్రలను తెలుసుకోండి, అప్రమత్తంగా ఉండండని కోరారు. రైతుల ఆందోళనకు సారధ్యం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రతినిధులతో చర్చలు జరిపిన కేంద్ర మంత్రుల ప్రతినిధి బృందంలో వ్యవసాయ మంత్రి కూడా ఒక్కరుగా ఉన్నారు. సోమవారం నాటి చర్చల విఫలం అయ్యాయి. అయితే ఇవి విఫలం కాలేదని, అసంపూర్తిగా నిలిచాయని మంత్రి తెలిపారు. రెండు దఫాల చర్చలలో పలు విషయాలపై అంగీకారం కుదిరిందని, అయితే కొన్ని విషయాలపై సయోధ్య లేదని మంత్రి అంగీకరించారు.

## పాశమైలారంలో భారీ అగ్నిప్రమాదం

**తెలంగాణ వీణ/పటాన్ చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం పాశమైలారంలోని రెండు పరిశ్రమల్లో మంగళవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సీఎంఎస్ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో సమీపంలో ఉన్న వనమాలి పరిశ్రమలోకి మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో నలుగురు కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి ఐదు ఫైర్ ఇంజన్లతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో పరిశ్రమంలో 11 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# గంజాయి దహనం





**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో:** జిల్లాలోని 17 పోలీస్ స్టేషన్లలో 142 కేసుల్లో వివిధ సందర్భాల్లో నిందితుల వద్ద నుండి సీజ్ చేసిన 11,061 కేజిల నిషేధిత గంజాయిని మంగళవారం హేమచంద్రాపురం గ్రామ శివార్లలోని నిర్మానుష అటవీ ప్రాంతంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ 27 కోట్ల రూపాయలకు పైగా ఉంటుంది. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ రోహిత్ రాజు సభ్యులైన ఓఎస్డి సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, పాల్వంచ డిఎస్పీ వెంకటేష్, మణుగూరు డిఎస్పీ రాఘవేందర్రావు ఆధ్వర్యంలో కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ నిషేధిత గంజాయిని ఉదయం నుండి సాయంత్రం వరకు దశల వారీగా విభజించి దహనం చేయడం జరిగింది. ముందుగా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ అయిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ స్టేషన్ల వారీగా కొన్ని భాగాలుగా విభజించిన గంజాయిని హెడ్ క్వార్టర్స్ నందు తూకం వేసి పరిశీలించారు. అనంతరం దహనం కొరకు సిద్ధం చేసిన మొత్తం గంజాయిని దగ్గర్లోని అటవీ ప్రాంతానికి తరలించి తగలబెట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొందరు అక్రమార్జనలో భాగంగా గంజాయిని విక్రయిస్తూ పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్న వారిని అరికట్టడం కోసం జిల్లా పోలీస్ శాఖలో రహస్య బృందాల్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్పీ రోహిత్ రాజుతో పాటు ఓఎస్డి సాయి మనోహర్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డిఎస్పీలు వెంకటేష్, రాఘవేంద్రరావు, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి








**తెలంగాణ వీణ/ఏపీ బ్యూరో/ఏలూరు:** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలనీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ అధ్యక్షులు ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) పశ్చిమగోదావరి జిల్లా రెవిన్యూ అధి కారి నారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ కె. సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ మండల పరిధిలో జరిగే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో స్థానిక ఎంపిపి, జెడ్పిటిసి, సర్పంచి వంటి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారలోపం జరిగినట్లు ఫిర్యాదులు వస్తే సదరు అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిషత్ సమావేశాలలో వివిధ శాఖల పనులకు సంబంధించి సభ్యులు వెలిబుచ్చిన సమస్యల పై తీసుకున్న చర్యలను సంబంధిత మండల స్థాయి ప్రజాప్రతినిధులకు కూడా తెలియజేయాలన్నారు. పేదప్రజల సంక్షేమానికి సామజిక, ఆర్ధిక, రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేయడంతో పాటు సమాజంలోని అన్ని వర్గాలకు సామజిక న్యాయం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి నవరత్నాల కార్యక్రమం కింద మానిఫెస్టో లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. ప్రభుత్వ పథకాలలో ఎటువంటి అవినీతికి తావులేకుండా లబ్దిదారులకు నేరుగా వారి అకౌంట్ లోనే జమ చేయడం జరుగుతున్నదన్నారు. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకం, ఆర్ డబ్ల్యూ.ఎస్., తదితర శాఖల ద్వారా మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలనీ, అనంతరం పనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. సభ్యులు తెలియజేసిన సమస్యలపై జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ స్పందిస్తూ వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తోటకూరగొమ్ము, దాచారం, కొయిదా, తదితర గ్రామాలలో తాగునీటి సమస్య కు మంచినీటి బోర్లు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేయాలనీ అధికారులను ఆదేశించారు. జలకళ బోర్లు ఏర్పాటు, ఇళ్ల స్థలాల మంజూరు, నాడు నేడు పనుల ప్రగతి, తదితర అంశాలపై సభ్యులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలకు సంబంధించి పూర్తి చేసిన పనుల బిల్లులను వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలనీ అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్ల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు మంజూరు అయినవెంటనే పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాలో జగనన్న భూ హక్కు, భూసర్వే కార్యక్రమం కింద అధునాతన పద్దతిలో డ్రోన్ల ద్వారా రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టామని, సదరు జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగిందన్నారు. సర్వే అనంతరం సదరు భూ యజమానులు నుండి సక్రమంగా ఉన్నాయని అంగీకారం తీసుకుంటారని, యజమానులు అభ్యంతరం వెల్లడించినట్లైతే సదరు సమస్య పరిష్కరించి, తరువాత మాత్రమే భూ హక్కు సర్వే పత్రం ముద్రించి సదరు రైతుకు అందించడం జరుగుతుందని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కలెక్టర్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యను మినిట్స్ లో నమోదు చేసి, తదుపరి సమావేశంలో సదరు సమస్యపై తీసుకున్న చర్యలను తెలియజేయాలన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో నాడు-నేడు కార్యక్రమం కింద నిర్మిస్తున్న పాఠశాలల అదనపు తరగతి గదులు, అంగన్వాడీ భవనాలు, ఇతర నిర్మాణ పనులలో కొన్ని 90 శాతం పూర్తి అయ్యాయని, డోర్లు, ఫర్నిచర్ వంటి కొన్ని సౌకర్యాలు కల్పించినట్లయితే వెంటనే వినియోగంలోకి తీసుకురావచ్చన్నారు. అధికారులు ఈ దిశగా పనిచేయాలని కోరారు. గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లుల ను వెంటనే ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిలో కలపర్రు నుండి గుండుగొలను మధ్య రోడ్లు గుంతల కారణంగా వాహనాలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో రహదారి మరమ్మత్తు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ జిల్లా కలెక్టర్ ను కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ కె. సుబ్బారావు, పశ్చిమ గోదావరి జిల్లా రెవిన్యూ అధికారి నారాయణ రెడ్డి, డి ఆర్ డి ఏ పీడీ విజయరాజు, గృహనిర్మాణ శాఖ పీడీ కె. రవికుమార్, వ్యవసాయశాఖాధికారి వై. రామకృష్ణ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్, ట్రాన్స్కో సూపెరింటెండింగ్ ఇంజినీర్లు శ్రీనివాసరావు, కేదారేశ్వరరావు, సత్యనారాయణ, సాల్మన్ రాజు,డిఎంహెచ్ఓ డా. శర్మిష్ఠ, డ్వామా పీడీ ఏ . రాము, జెడ్పి టీసిలు,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రనిధులు పాల్గొన్నారు.

## భేటి బచావో- భేటి పడావో..



**తెలంగాణ వీణ/నడికూడ:** నడికూడ మండల కేంద్రంలోని రైతు వేదిక నందు మంగళవారం ప్రాజెక్టు సిడిపిఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో "భేటీ బచావో బేటి పడావో" కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ సాధికారిక ఆడ,మగ మధ్య వివక్షత చూపరాదని, ఆడపిల్లల పట్ల ప్రాముఖ్యత చూపించాలని పలు అంశాలను వివరించారు.సుకన్య సమృద్ధి యోజన, మహిళ సమృద్ధి యోజన, మరియు సీనియర్ సిటిజన్స్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిక సంస్థ స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లెటర్ సి. లావణ్య సూపర్వైజర్ కె. శ్రీదేవి,రోజా రాణి, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కుట్ర పూరిత విధానాన్ని ఎండగట్టండి

**- చలో నల్గొండకు బయలుదేరిన టిఆర్ఎస్ శ్రేణులు**



**తెలంగాణ వీణ/తొర్రూర్:** తెలంగాణ నదీ జరాలపైన కేంద్రం పెత్తనానికి దాసోహం అన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా టిఆర్ఎస్ పార్టీ ఈరోజు నల్లగొండలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు బయలుదేరిన పార్టీ శ్రేణులుఈ కార్యక్రమంలో తొర్రూరు మండలం నుండి సుమారు 300 మంది నాయకులు ఆర్టిసి బస్సులో బయలుదేరారు వారిలో మండల ప్రధాన కార్యదర్శి ప్రమోద్ ఆయా గ్రామాల నాయకులు కాలు నాయక్ వెంకటరమణ కుమార్ బిక్షపతి మురళి రమేష్ విశ్వకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ నాయకులు బ్రహ్మయ్య జన్మదిన వేడుకలు

**తెలంగాణ వీణ/ములకలపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గంములకలపల్లి మండల కేంద్రంలో జరిగిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు డిసిసిబి డైరెక్టర్ అశ్వాపురం తుళ్ళూరు బ్రహ్మయ్య జన్మదిన వేడుకలో పాల్గొన్న ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కేక్ కట్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు రాజకీయాలలో బ్రహ్మయ్య ఉన్నత శిఖరాలు అదిరోహించాలని అన్నారు, ములకలపల్లి మాజీ పి ఏ సి ఎస్ చైర్మన్ కరుటూరికృష్ణ మాజీ వైస్ ఛైర్మన్ పువ్వాల మంగపతి మండల కాంగ్రెస్ నాయకులు పాలకుర్తి రత్నభూషణం సురభి రాజేష్ ముదిగొండ శివ తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు గుమ్మడి దేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందితకు రోడ్డు ప్రమాదం

**తెలంగాణ వీణ/ఉప్పల్:** టిఆర్ఎస్ నేత సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు, లాస్య నందిత నల్గొండలో టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ బహిరంగ సభకు హాజరై తిరిగి వస్తుండగా నార్కెట్పల్లి సమీపంలోని చర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారును ఆటో ఢీకొట్టింది, ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత తలకు గాయాలయ్యాయి ప్రమాద సమయంలో కారులో ఎమ్మెల్యే తో పాటు ఆగ సోదరి నివేదిత ఇద్దరు గన్మెన్లు ఉన్నారు కాగా నల్గొండలో నిర్వహించిన కేసీఆర్ సభకు భారీ ఎత్తున బిఆర్ఎస్ నేతలు కార్యకర్తలు తరలివచ్చారు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు, తెలంగాణ ప్రజలు ఏదో కోపంలో పాలిచ్చే గేదెను కాదని దున్నపోతుల ఎన్నుకున్నారని కాంగ్రెస్ మీద విమర్శలు గుప్పించారు, మరోవైపు టిఆర్ఎస్ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు.



## చలో నల్లగొండ.. నాడు రాష్ట్రం కోసం.. నేడు రాష్ట్ర హక్కుల కోసం



**తెలంగాణ వీణ/రాయపర్తి:** కృష్ణా నదిపై శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ, ప్రాజెక్టులను కేఅర్ఎంబికి అప్పగించడం వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాలను ప్రజలకు వివరించడానికి, తెలంగాణ హక్కుల పరిరక్షణ కొరకు బీఆర్ఎస్ అదినేత, మాజీ ముఖ్యమంత్రి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు రాయపర్తి మండలం నుండి వివిధ గ్రామాల నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు జీవో రూపంలో తక్షణమే అమలుపరచాలి

### - కార్మిక నాయకులు వెల్లడి




**తెలంగాణ వీణ/ఏలూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ సందర్భంగా కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీలన్నిటికీ జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడు ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం ఏ ఐ టి యు సి నాయకులు యూనియన్ నాయకులు అసిస్టెంట్ కమిషనర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు.ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12 13 తేదీలలో కార్పొరేషన్ లో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ వర్కర్లు మరియు ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్ సప్లై వాటర్ వర్క్స్ ఉద్యోగ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై మంగళవారం భోజన విరామ సమయంలో నగరపాలక సంస్థ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ఏఐటియుసి ఏలూరు ఏరియా అధ్యక్ష కార్యదర్శులు కే కృష్ణమాచార్యులు ఏ అప్పలరాజు మాట్లాడుతూ సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవోల రూపంలో తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన మూడు సంవత్సరాల సరెండర్ లీవ్ ని తక్షణమే చెల్లించాలని వారు కోరారు. రాష్ట్రంలో నగరపాలక సంస్థలలో పురపాలక సంఘాలలో నగర పంచాయతీలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బంది నీ వారి సర్వీస్ ఆధారంగా రెగ్యులర్ చేయాలని ఇంజనీర్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ వర్క్స్ వాటర్ సప్లై అండర్ గ్రౌండ్ డ్రైనేజీ స్ట్రీట్ లైటింగ్ లో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బందిని స్కిల్డ్ సెమీ స్కిల్డ్ అన్ స్కిల్డ్ కేటగిరీలుగా గుర్తించి వారికి పెరిగిన వేతనాలు జీవోలు జారీ చేసి తక్షణమే అమలు చేయాలని శ్రీనివాసరావు కృష్ణమాచార్యులు అప్పలరాజు ప్రభుత్వాన్ని డిఎంఏ అధికారుల్ని డిమాండ్ చేశారు. 2024 ఫిబ్రవరి 24 నాటికి జీవోలు జారీ చేయకపోతే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మిగతా యూనియన్లను కలుపుకొని మరొక్కసారి రాష్ట్ర వ్యాప్త సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు యూనియన్ నాయకులు యలగాడ శివకుమార్ ఎస్ఎంఈ సుబ్బారావు అంతరాజు లీల కుమార్ అంతరాజు కిరణ్ గేదెల నాగేశ్వరరావు వంశీ నాగబాబు నూకరాజు అశోక్ మోజెస్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గట్టమ్మ దేవాలయంలో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు





**తెలంగాణవీణ/ములుగు:** టిపిసిసి ప్రధాన కార్యదర్శి కుచన రవళి రెడ్డి చేపట్టిన పాదయాత్ర ను ప్రారంభించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ములుగు గట్టమ్మ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గట్టమ్మ దేవాలయం నుండి మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతల వరకు ఎన్నికల సమయం లో రాష్ట్రం లో కాంగ్రెస్ రావాలని సీతక్క గారు మంత్రి కావాలని ఇవన్నీ నెరవేరితే ములుగు గట్టమ్మ దేవాలయం నుండి మేడారం వరకు పాదయాత్ర చేస్తానని మొక్కిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కుచన రవళి రెడ్డి మొక్కు సందర్భంగా పాదయాత్రను ప్రారంభించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశానికి బ్లాక్ డే



**తెలంగాణవీణ/జమ్మూ:** జమ్మూ కశ్మీర్‌లో సైనిక బలగాలే లక్ష్యంగా ఉగ్రమూకలు నిరంతరం దాడులకు పాల్పడుతుంటాయి. అయితే, ఏకంగా సైనిక వాహనశ్రేణినే టార్గెట్ చేస్తూ ఉగ్రవాదులు దాడికి పాల్పడి 40 మంది సైనికులను పొట్టనబెట్టుకున్న ఘటన 2019 ఫిబ్రవరి 14న చోటుచేసుకుంది. పాక్ ఉగ్రవాదుల దుశ్చర్యకు సైనికులు బలయ్యారు. ఓ మలుపు వద్ద పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో వేగంగా కాన్వాయ్‌లోకి ప్రవేశించిన ఫిదాయి.. తనను తాను పేల్చుకుని దారునికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో యావత్ దేశం శోకంలో మునిగిపోయింది. సరిగ్గా ఐదేళ్ల కిందట ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో సైనిక వాహన శ్రేణిపై పాకిస్థాన్‌కు చెందిన జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు ఆత్మాహుతికి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్)కి చెందిన 40 సైనికులు బలయ్యారు. జమ్ము- శ్రీనగర్ జాతీయ రహదారిపై లేథిపుర (అవంతిపురా సమీపం)లో 2019 ఫిబ్రవరి 14న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈ ఘాతుకం చోటుచేసుకుంది. జమ్మూ నుంచి సైనికులు శ్రీనగర్‌కు వెళ్తుండగా ఈ ఆత్మాహుతి దాడి జరిగింది.ఆత్మాహుతి దాడికి కశ్మీరీ ఉగ్రవాది ఆదిల్ అహ్మద్ దార్‌ను వినియోగించారు. ఆత్మాహుతి దాడిలో పాల్గొన్న ఆ ఉగ్రవాది కూడా హతమయ్యాడు. పక్కా వ్యూహంతోనే ఉగ్రవాదులు దాడికి పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. సీఆర్పీఎఫ్ వాహనాలను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాది అదిల్ అహ్మద్ దార్, తన వాహనాన్ని జాతీయ రహదారిపై కల్వర్టు పక్క నుంచి కాన్వాయ్‌కి ఎడమవైపు నుంచి ప్రవేశించాడు. జాతీయ రహదారికి అనుబంధ మార్గం నుంచి అవంతీపొర సమీపంలో లాటూ గుండా అతడు వచ్చినట్టు పోలీసులు గుర్తించారు. సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌లోకి ప్రవేశించిన ఉగ్రవాది, మొదటి బస్సును దాటుకుంటూ ఎడమ వైపు నుంచి ఐదో వాహానాన్ని ఢీకొట్టాడు. ఉగ్రదాడి జరగడానికి ముందు స్థానిక యువకులు దాదాపు 10 నిమిషాల పాటు సీఆర్పీఎఫ్ వాహన శ్రేణిపై రాళ్లు రువ్వారు. ఈ సమయంలోనే పేలుడు పదార్థాలతో ఉన్న కారును నడుపుకుంటూ వచ్చిన ఉగ్రవాది, సీఆర్పీఎఫ్ వాహన శ్రేణిలోని ఐదో బస్సును ఢీకొట్టాడు. దాడికి అనువైన ప్రదేశాన్ని కూడా వ్యూహాత్మకంగానే ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నారు. జమ్మూ-శ్రీనగర్ రహదారిలో లెత్‌పోరా వద్ద రోడ్డు చాలా వాలుగా ఉంటుంది. ఈ ప్రదేశంలో వాహనాలు నెమ్మదిగా వెళ్తాయి. సీఆర్పీఎఫ్ కాన్వాయ్ సైతం నిదానంగా వెళ్తుందని ముందే అంచనా వేసిన ఉగ్రవాది 78 వాహనాల కాన్వాయ్‌లోని 5వ బస్సును లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ ప్రదేశంలో ఎటువంటి సీసీ కెమేరాలు లేకపోవడంతో వారి పని మరింత సులువైంది. సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో 10మందికి పైగా మిలిటెంట్లు హతమయ్యారు. పుల్వామా దాడి తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ దాడికి తామే బాధ్యులమంటూ పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించడంతో భారత్ మరింత ప్రతీకారంతో రగిలిపోయింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలని భావించిన భారత్.. అందుకు మరోసారి సర్జికల్ స్ట్రయిక్స్‌ను ఎంచుకుంది. ఫిబ్రవరి 26 తెల్లవారుజామున సరిహద్దులు దాటి పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లిన భారత వాయుసేన విమానాలు.. బాలాకోట్‌లోని జైషే మొహమ్మద్ ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడ్డాయి. ఈ ఎయిర్ స్ట్రయిక్స్‌లో దాదాపు 300 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. 40 ఏళ్ల తర్వాత పాక్ భూభాగంలోకి భారత్ యుద్ధ విమానాలు చొచ్చుకెళ్లడం ఇదే తొలిసారి. బాలాకోట్ ఎయిర్ స్ట్రయిక్స్ తర్వాత దాయాదుల మధ్య యుద్ధ మేఘాలు మరింత కమ్ముకున్నాయి. ఈ దాడికి ప్రతీకారంగా సరిహద్దుల్లోని సైనిక స్థావరాలపై ఎఫ్-16 యుద్ధ విమానాలతో పాకిస్థాన్ దాడికి ప్రయత్నించింది. అయితే, వీటిని భారత సైన్యం సమర్ధంగా తిప్పికొట్టింది.


## మోడల్ అంగన్‌వాడి కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



**తెలంగాణవీణ/ములుగు:** ములుగు మండలం లోని జగ్గన్న పేట గ్రామములో మహిళా శిశు సంక్షేమ శాఖ తెలంగాణ ఆధ్వర్యములో ఏర్పాటు చేసిన మోడల్ అంగాన్ వాడి కేంద్రాన్ని మరియు పుట్ట మల్లన్న గుడి దగ్గర బోరు మోటార్ ను ప్రారంభించిన ప్రారంభించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడం తో పాటు మన మొదటి అక్షరాభ్యాసం ఇక్కడి నుంచే మొదలు అవుతుంది అని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీతక్క అన్నారు త్వరలోనే అనేకమైన రోడ్డు పనులు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారభించుకుందాం అని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఐఎఎస్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) శ్రీజ ఐఎఎస్,ఐసిడిఎస్ అధికారి మరియు అంగన్వాడీ టీచర్ తో పాటు గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మార్కెట్ చైర్మన్ బలుస అరుణపై దాడి దారుణం

### - దోషులను తక్షణం అరెస్టు చేయాలి - ఆర్యవైశ్య మార్కెట్ వ్యాపారస్తులు తక్షణమే రైతుల నుండి కొనుగోళ్లు నిలిపి వేయాలి.



**తెలంగాణవీణ/వరంగల్ జిల్లా :** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీమతి బలుస అరుణ పై రైతులు దాడి చేయడం దారుణమని (ఆర్యవైశ్య పోరాట సమితి ) వరంగల్ జిల్లా గౌరవ సలహాదారులు గుండా ప్రభాకర్ గుప్త తీవ్రంగా ఖండించారు .ఆర్య వైశ్యులు మార్కెట్ చైర్మన్ గా ఉండడం కొందరు జీర్ణించుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నరున్ని ఆరోపించారు సమాజంలో అన్ని కులాలతో పాటు వైశ్యులకు కూడా రాజకీయాల్లో ఉండేందుకు హక్కు ఉందని తెలిపారు. తుకాలలో మోసాల జరిగితే గిట్టుబాటు ధర లభించక పోతే చైర్మన్ కు కానీ ,సెక్రటరీకి కానీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి కానీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదని ఆయన అన్నారు. రైతులు ఆమెను కొట్టుకుంటూ తీసుకురావడం అమానుషమైన చర్యని . ఇప్పటివరకు ఎందరో మార్కెట్ కమిటీ చైర్మన్ లు గా చేసిన వారు ఉన్నారు. కానీ ఏ మార్కెట్ చైర్మన్ పై కూడా దాడి చేయలేదని . ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి మాత ఆత్మార్పణ చేసుకున్న రోజున ఈ సంఘటన జరగడం అమానుషం గా భవిస్తూ. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని . దోషులను శిక్షించి, బేషరతుగా క్షమాపణలు చెప్పించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టేందుకు కూడా ఆర్యవైశ్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆర్యవైశ్యులు మార్కెట్ వ్యాపారస్తులు తక్షణమే రైతుల నుండి కొనుగోళ్లు అమ్మకాలు నిలిపి వేయాలి అయన కొరకు.

## ఫిబ్రవరి 16 దేశవ్యాప్త కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్

**తెలంగాణ వీణ/చింతలపూడి:** దేశవ్యాప్తంగా కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను హరించి వేయడం,ప్రభుత్వ రంగ సంస్థలను తెగ నమ్మటం,బడా పెట్టుబడిదారులకు కార్మిక వర్గం సృష్టించిన సంపదను దోచి పెట్టడానికి వ్యతిరేకంగా మరియు మూడు రైతాంగ నల్ల చట్టాలను రద్దు చేస్తున్నామని,రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని,ఉత్తరప్రదేశ్ లఖింపూర్ లో ఢిల్లీ రైతాంగం ఉద్యమం సందర్భంగా వాహనాలతో తొక్కించి చంపబడ్డ రైతాంగానికి న్యాయం చేసిదోషులను కఠినంగా శిక్షిస్తామన్న ప్రధానమంత్రి పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం బడ్జెట్ నిధులలో కోత విధించి పథకాన్ని నీరు కార్చడానికి నిరసన గాఫిబ్రవరి 16,వ తేదీన దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కార్మిక, కర్షక ,వ్యవసాయ కూలీలు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన జాతీయ సమ్మె మరియు ,గ్రామీణ ప్రాంత బంద్ ను జయప్రదం చేయాలని చింతలపూడి సిఐటియు ఆధ్వర్యంలో కరపత్ర అవిష్కరణను ఎం.బాలరాజు అధ్యక్షతన అంగన్వాడీ, ఆశ ,మున్సిపల్ ,మెడికల్ అండ్ హెల్త్ ,మెప్మా ఆర్పీలు ,బిల్డిం రంగం ,వ్యవసాయ కార్మిక రంగం నుండికార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## చలో నల్గొండ కార్యక్రమానికి బయలుదేరిన చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్ బొన్నాల, బిఆర్ఎస్ నాయకులు





**తెలంగాణ వీణ/ఉప్పల్:** ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చిలుక నగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తో కలిసి ఆర్టిసి బస్సులో చిల్కానగర్ డివిజన్ ముఖ్య నాయకులు కార్యకర్తలు నల్గొండ సభకు బయలుదేరారు,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం చలో నల్గొండ కార్యక్రమానికి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ డివిజన్ అధ్యక్షులు పల్లె నర్సింగరావు ఆధ్వర్యంలో డివిజన్ ముఖ్య నాయకులు, పెద్ద ఎత్తున చిల్కానగర్ డివిజన్ నుండి బయలుదేరడం జరిగింది, చిల్కానగర్ డివిజన్ నుండి బస్సులో బయలుదేరిన నాయకులు ఉప్పల్ బగయత్ లో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో నాయకులతో కలిసి ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నల్గొండ సభకు బయలుదేరారు.

## విద్యార్థులు నిరుద్యోగులతో గెలిచిన కాంగ్రెస్ విశ్వవిద్యాలయాలకు పెద్దపీట వేయాలి

**- ఉస్మానియా విశ్వవిద్యాలయ అభివృద్ధికై ప్రత్యేక నిదులివ్వాలి**

**- బహుజన విద్యార్థి సంఘాలు, ఓయూ జేఏసీ డిమాండ్**



**తెలంగాణ వీణ/ఓయూ:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి విద్యార్థులు మరియు నిరుద్యోగులు స్వచ్ఛందంగా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా ఇప్పటి వరకు విశ్వవిద్యాలయాల ప్రక్షాళనకు ఏటువంటి చర్యలు చేపట్టలేదు. కేసీఆర్ ను అధికారంలో నుండి గద్దె దింపడంలో నిరుద్యోగులు విద్యార్థులు తమ శక్తి మేరకు గ్రామాలలో పని చేసారు. అందువలన కాగ్రెస్ ప్రభుత్వం మేము విద్యార్థులు నిరుద్యోగుల వలనే గెలిచాము అని మాటలు చెప్పకుండా తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఉస్మానియా కు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. తెలంగాణ లోని ప్రభుత్వ యూనివర్సిటీలు అన్నింటిని ప్రక్షాళన చేసి కాగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. గత బిఆరెస్ ప్రభుత్వం విద్యను విద్యావ్యవస్థను సర్వనాశనం చేసింది కాబట్టే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి విద్యార్థులు నిరుద్యోగులు టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పజెప్పడం జరిగింది. ఇప్పుడు మీరు విద్యా వ్యవస్థను విశ్వవిద్యాలయాలను ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి పొందే వైపు నడిపించాలని ఇదే అసెంబ్లీ సమావేశాలలో మరల విద్యకు, ఉస్మానియా యూనివర్సిటీకి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీ ఎస్ఎఫ్), బహుజన స్టూడెంట్ జాక్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ ఉస్మానియాను యూనివర్సిటీ అంటే తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ లాంటిది అలాంటి యూనివర్సిటీ నిర్వీర్యం అయిపోతుంది కాబట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం అధిక నిధులు కేటాయించి విద్యావ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత మీదని గుర్తు చేస్తూ ఈ అసెంబ్లీ సమావేశాల్లో తిరిగి ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ ఓయూఅధ్యక్షులు సోమల అంబేద్కర్, చందు, కుమార్ ఆనంద్ ,సత్యం వెంకట్, భాస్కర్ ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతను పాటించాలి

**తెలంగాణ వీణ/నూజివీడు/ఏలూరు:** రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా మీ ప్రాణాలతో పాటు ప్రయా ణికుల ప్రాణాలను కూడా కాపాడినవారవుతారని మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ జి.నాగ మురళి డ్రైవర్లనుద్దేశించి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనర్ ఎస్ శాంత కుమారి అధ్వర్యంలో మంగళవారం నూజివీడు పట్టణంలోని మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ మరియు ఆటో డ్రైవర్లతో కలసి రహదారి భద్రత అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు హెల్మెట్, సీటుబెల్ట్ ఉపయోగించడం తప్పనిసరి అన్నారు. సామర్థ్యానికి మించి వాహనాల్లో ప్రయాణికులను తరలించిన వారిపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. సత్వరమే స్పందించి ప్రమా దానికి గురైన వారిని ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారిని ఆపద్బాంధవుడిగా గుర్తించి 5 వేల రూపాయలు బహు మతిగా అందించి, ప్రశంసా పత్రం ఇవ్వబడుతుంది తెలిపారు.




## సమస్యల పరిష్కార దిశగా అధికారులతో ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పర్యటన



**తెలంగాణ వీణ/ఉప్పల్:** అధికారులతో కలిసి ఉదయం వీధుల్లో తిరుగుతూ ప్రజల సమస్యల పై అరా, గ్రామాలలో తాగునీటి తిప్పలు కుక్కల, కోతుల బెదద త్వరగా సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులకు సూచన ఇంటి పన్ను నిధులతో గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వాలి: ఏనుగు సుదర్శన్ రెడ్డి మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ ఎదులాబాద్ గ్రామంలో రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు,ఘట్కేసర్ మండల ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి స్పెషల్ ఆఫీసర్ నందకిషోర్, ఆర్డబ్ల్యూఎస్ ఎఈలు హరిణి, శామ్యూల్ కలిసి గుడ్ మార్నింగ్ ఘట్కేసర్ కార్యక్రమంలో భాగంగా ఉదయం వీధుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి గారు మాట్లాడుతూ గ్రామంలో త్రాగునీరు,సాగునీరు కొరత, కుక్కల కోతుల బెదద ఏర్పడిందని దీనికితోడు తయారైన వాటర్ ట్యాంకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో సమస్యకు దారి తీస్తుందన్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తున్నారు రెండు రోజుల్లో వాటర్ ట్యాంక్ కనెక్షన్ ఇచ్చి ప్రతి ఇంటికి నీరు అనే విధంగా చూడాలని ఇతర సమస్యపై ఇబ్బందులు కలగకుండా త్వరగా సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులను సూచించారు. పన్ను సక్రమంగా వసూలు చేయకపోవడంతో గ్రామపంచాయతీ సిబ్బందికి ఐదు నెలల నుంచి జీతం అందడం లేదని వారి బ్రతుకుతెరువుకు ఇబ్బంది కలుగుతుందని వారి సమస్యపై జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గట్టగల రవి, నాయకులు కందుల కుమార్ ముదిరాజ్, బాలరత్నం ముదిరాజ్, శ్రీశైలం,భాస్కర్ గౌడ్, గట్టుపల్లి మల్లేష్, బద్ధం నాగరాజు, రాము, గ్యార చిరంజీవి, గ్రామ పెద్దలు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

## మధుర నగర్ శ్రీనివాసపురం రోడ్డు యుజిడి పనులను అధికారులతో పరిశీలించిన హబ్సిగూడ కార్పొరేటర్ కక్కినేని





**తెలంగాణ వీణ/ఉప్పల్:** హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి మధురానగర్ లో కొత్త రోడ్డు పనులు శ్రీనివాసపురం యూజీడీ పనులను అధికారులతో కలిసి రోడ్డు పనులు ఎలా జరుగుతున్నాయని చూడడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి ఓగిరాల మూర్తి కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఒకే స్కూల్ ఒకే కాన్సెప్ట్ ముందుకెళ్లితే మార్పు వస్తుంది

**- ఓయూ విసి ప్రొ. రవీందర్ యాదవ్**




**తెలంగాణ వీణ/ఓయూ:** రాష్ట్ర వ్యాప్తంగా ఒకే స్కూల్ ఒకే కాన్సెప్ట్ ముందుకెళ్లితే విద్యార్థుల చదువులో మార్పు వస్తుందని ఓయూ వైస్ చాన్సర్ ప్రొ. రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. యునివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యూకేషన్ ఆద్వర్యంలో మంగళవారం బీఈడీ కాలేజ్లో ఎంపవరింగ్ స్కూల్ గర్ల్స్ ఆఫ్ తెలంగాణ రోల్ ఆఫ్ కెజిబీవీస్ ఇన్ది లైట్ ఆఫ్ ఎన్ఆపి 2020 పేరుతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్షాప్కు ముఖ్య అతిథులుగా హాజరైన విసి. ప్రొ. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ బాలికల సాధికారిత కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. బాలికల పట్ల వివక్ష తొలగించేందుకు తల్లి, తండ్రులు చిన్ననాటి నుంచే అవగాణ కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల్లో సరివడ రెగ్యులర్ టీచర్లు లేరని, స్కూల్స్ లల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం సూల్స్ అని, మోడల్ స్కూల్స్ అని గురుకుల స్కూల్స్, మైనార్టీ స్కూల్స్ అని కాకుండా ఒకే గొడుగుకిందకు రావాలని సూచించారు. ఒకే స్కూల్ ఒకే కాన్సెప్ట్ ప్రభుత్వం ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వర్క్ షాప్ కోఆర్డినేటర్ డా.పి.శంకర్ మాట్లాడుతూ బాలికల సాధికారతను వాళ్లంతట వాళ్లే సాధించుకోవడానికి ఇలాంటి వర్క్షాపులు దోహదపడుతాయన్నారు. బాలికల పట్ల ఉన్న వివక్షను తొలగించేందుకు వర్క్షాప్ను ఏర్పాటు చేశామన్నారు. విద్యద్వార ఏవిధంగా సాధికారత వస్తుందని వర్క్ షాప్లో పిల్లలకు అవగాణ కల్పించామని చె ప్పారు. ఈ వర్క్షాప్లో వివిద స్కూల్స్ లల్లో నుంచి వచ్చిన విద్యార్థులు, టీచర్లు, ప్రొఫెసర్ల ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మినారాయణ, ప్రొఫెసర్లు గడ్డ మల్లేశం. డిపార్ట్ మెంట్ హెడ్ ప్రొ.టి. మృణాలిని. ప్రిన్సిపల్ ప్రొ.కె.మూర్తి, రమేష్ చంద్ర, ప్రొ. ఎస్. శ్రీనివాస్ రావు, రాజ ష్ కుమార్, డా.డి. సునితతోపాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు జంట కార్పొరేషన్ల కమిషనర్లకి సమ్మె నోటీస్



**తెలంగాణ వీణ/ఉప్పల్:** మేడిపల్లి మండలం పీర్జాదిగూడ, బోడుప్పల్ జంట మున్సిపల్ కార్పొరేషన్ల ఆఫీసుల్లో ఫిబ్రవరి 16న, జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ లో కార్మికులు పాల్గొంటారని రాష్ట్ర మున్సిపల్ నాయకులు కల్లూరి జయచంద్ర, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ , ఏఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి దండు రమేష్ , ఆధ్వర్యంలో కమిషనర్ల కి కలిసి సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగినది. ఇరువురు కలిసి మాట్లాడుతూ జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు మున్సిపల్ ఆఫీసులో కార్మికులు కూడా సమ్మెలో పాల్గొంటారని.తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాలకు, అనుబంధ యూనియన్ గా ఉన్న మేము జాతీయ సమ్మెతో పాటు, గ్రామీణ బందులో భాగస్వాములమ వుతామని తెలియజేస్తూ పారిశ్రామిక విధానాల చట్టం 1947 సెక్షన్-22, సబ్ సెక్షన్-(1) అనుసరించి. ఈ సమ్మె నోటీసు ఇస్తున్నా మని తెలియజేస్తున్నాము. 2024 ఫిబ్రవరి 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ ఉద్యోగస్తులు, కార్మికులు మొత్తం పాల్గొంటారని తెలియజేస్తూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## భారతదేశ మొదటి గవర్నర్ సరోజినీ నాయుడు జయంతి

**- జిహెచ్ఎంసి కార్మికులని అభినందించిన సుధాకర్ గాందే**



**తెలంగాణ వీణ/ఉప్పల్:** మహిళ దినోత్సవం సందర్భంగా రామంతపూర్ పద్మశాలి సంఘం భవనంలో మహిళా స్వతంత్ర సమరయోధురాలు భారతదేశపు మొదటి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు జయంతి, మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిహెచ్ఎంసి మహిళా కార్మికులను ప్రోత్సహిస్తూ అభినందన కార్యక్రమం నిర్వహించిన సుధాకర్ గాందే, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హుజురాబాద్ మాజీ శాసనసభ్యులు ఈటల రాజేందర్ ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ రామంతపూర్ కార్పొరేటర్ బండారి శ్రీవాణి వెంకటరావు ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మహిళా సిబ్బందికి చీరలు కానుకగా అందజేసి భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు,ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిహెచ్ఎంసి కార్మికులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం



**తెలంగాణ వీణ/ఉప్పల్:** పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం,ఉప్పల్ లో సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.మంగళవారం కాళేశ్వరం టూర్ కు ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి బయలు దేరారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ ఘన స్వాగతం పలికారు.



## విద్యార్థులు కష్టపడి చదవాలి






**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో:**కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో రామవరం సుభాస్ చంద్రబోస్ నగర్ లోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ లో పదవ తరగతి విద్యార్థులయఫ్.ఏ పరీక్షల తనిఖీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా తనిఖీ బృందం అధికారి కల్యాణ్ శర్మ ఉపాధ్యాయులకు విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.విద్యార్థుల జీవితాల్లో పదవ తరగతి అతి ముఖ్యమైన మెట్టు అని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే కష్టపడి చదవాలి అన్నారు. మిగిలిన సమయాన్ని ప్రణాళిక బద్ధంగా సబ్జెక్టు వైజ్ గా చదివి స్కూల్ కు జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.తనిఖీ బృందంలో నగేష్, హఫీజున్, శంకర్, మాధవీలత, తారాచంద్, వీరబాబు, పాఠశాల కరస్పాండెంట్ షేఖ్ అబ్దుల్ బాసిత్, ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## వైయస్సార్ నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ



**తెలంగాణ వీణ/చింతలపూడి:** నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం చింతలపూడి పట్టణంలో మంగళవారం మార్కెట్ యార్డ్ చైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు పార్లమెంట్ వైఎస్ఆర్సిపి ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్, చింతలపూడి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయ రాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలను రూపొందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. వారు ఇరువురు రాబోయే పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో తమను మహిళలందరూ అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎంపీపీ డాక్టర్ రాంబాబు, జడ్పిటిసి నీరజ, మండల సచివాలయాల కన్వీనర్ టి శ్రీనివాసరావు, చింతలపూడి పట్టణ సచివాలయాల కన్వీనర్ నిమ్మగడ్డ దుర్గారావు, చింతలపూడి పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు, నాయకులు మిరియాల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కార్యకర్తకు రోషన్ కుమార్ ఆర్థిక సహాయం

**తెలంగాణ వీణ/చింతలపూడి:** చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో పెద్దకర్ల వెంకటేశ్వరరావు తెలుగుదేశం కార్యకర్త కి ఆక్సిడెంట్ అయిన విషయం గ్రామ అధ్యక్షులు పసునూరి సుబ్బారావు ఇతర నాయకుల ద్వారా తెలిసుకొన్న మన ప్రియతమ నాయకులు సొంగ రోషన్ కుమార్ వెంటనే స్పందించి వారి స్వగృహం నందు కార్యకర్తనీ పరామర్శించి వారి కుటుంబానికి నాలుగు నెలలు 2000 రూపాయలు పెన్షన్ ఇస్తానని తెలిపారు .ఇచ్చిన మాట ప్రకారం గ్రామ పెద్దల సమక్షంలో పెన్షన్ అందచేసారు.ఎవరైన నాయకులు దాతలు స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.కార్యక్రమం లో మందపాటి పాపారావు , తాల్ల వెంకటేశ్వరరావు ఉలసా వెంకటేశ్వర రావు,తెలుగు యువత రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం

**- హైదరాబాదులో మాల భవన్ ఏర్పాటు చేయాలి**
**- తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**
**- అచ్చంపేట ఎంఎల్ఏ చిక్కుడు వంశీ క్రిష్ణకు వినతి పత్రం**
**- మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డా పసుల రాంమూర్తి**
**- రాష్ట్ర అధ్యక్షులు జూపాక సుధీర్**






**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** హైదరాబాద్‌లోని అసెంబ్లీ సాక్షిగా మాల స్పీకర్ మాల ఎమ్మెల్యేను కలిసి మాల మహానాడు ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభ స్పీకర్ చిక్కుడు వంశీకృష్ణ అచ్చంపేట శాసనసభ్యులను కలిసివినతి పత్రం ఇవ్వడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్సీ వర్గీకరణ కు మద్దతు తెలుపవద్దని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డా పసుల రాంమూర్తి రాష్ట్ర అధ్యక్షులు జూపక సుధీర్ లు కోరారు.బీజేపీ ప్రభుత్వం దళితులలను చిల్చడానికి కుట్ర చేస్తోంది అన్నారు ఏడుగురు జడ్జిలచే కమిటీ వేసి సుప్రీం కోర్టులో వాదనలు విన్నారన్నారు మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాదిగలు బీజేపీ కి మద్దతు ఇచ్చినా సంగతి మీకు తెలిసిందే అన్నారు మాలలు మాత్రం కాంగ్రెస్ పార్టీని మద్దతు చెప్పి గెలిపివ్వడం జరిగింది అన్నారు గత ప్రభుత్వం ధరణి పథకాన్ని తీసుకవచ్చి దళితుల పొట్టకోట్టారారని మండిపడ్డారు లక్షలాది ఎకరాల భూమి తిరిగి దళితులకు ఇప్పించాలని కోరారు అసండు భూములకు పట్టాలు ఇవ్వాలని పార్టీ కోసం కష్ట పడ్డా మాలలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని వి ఆర్ ఓ వి ఆర్ ఏ లను తిరిగి వారి స్థానాల్లో వారికి పోస్టులు ఇవ్వాలని కోరారు హైదరాబాద్ కేంద్రంగా మాల భవాన్ నిర్మించాలని కోరారు రాబోవు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో పెద్ద స్థాయిలో ఉద్యమాలు చేపడతామని రాష్ట్రంలో ఉన్నటువంటి మాల బిడ్డలు మేధావులు కర్షక కార్మిక మన మాలకుల బాంధవులందరూ కలిసి ఉద్యమాలకు సిద్ధం కావాలని లేకపోతే రాబోవు రోజుల్లో మాలలు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారని మతతత్వ పార్టీ అయిన బిజెపి కొంతమందికి డబ్బులు ఇచ్చి పదవుల ఆశలు చూపించి దళితుల మధ్యలో చీలిక తీసుకువచ్చి ఒక వర్గాన్ని ఓట్ల శాతం పెంచుకోవడానికి ఒక జాతిని పెంచి పోషిస్తూ మాల జాతి ఉనికిని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్న మతతత్వ పార్టీ బీజేపీ మత్తులో ఉన్న మాదిగ నేతల తలదించే విధంగా ఉద్యమాలకు సిద్ధం కావాలి అని పిలుపునిచ్చారు. జాతీయ ఉపాధ్యక్షులు ముత్య మాల పుల్లయ్య జాతీయ కార్యదర్శి కాసార్ల యాదగిరి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

---

# ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**తెలంగాణ వీణ/చింతలపూడి:** మున్సిపల్ కార్మికులు సమ్మె విరమణ సందర్భంగా మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలకు వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్ర ప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఏలూరు జిల్లా చింతలపూడి మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు మాట్లాడుతూ సమ్మె విరమణ సందర్భంగా మంత్రివర్గ ఉప సంఘం ఉన్నత అధికారుల మున్సిపల్ కార్మిక నాయకుల సమక్షంలో ఒప్పుకున్నా వివిధ సమస్యలను మినిట్స్ ఇచ్చారు కానీ నెల రోజులు కావస్తున్నా వాటిని జీవోల రూపంలో విడుదల చేయలేదని వెంటనే ఒప్పుకున్న అన్ని డిమాండ్స్ ను జీవోల రూపంలో విడుదల చేయాలని జీవోలు ఇచ్చిన వాటిని అమలు చేయాలని, ముఖ్యంగా తక్షణం 21 వేల రూపాయల జీతానికి సంబంధించిన జీవో విడుదల చేయాలన్నారు. చింతలపూడి నగర పంచాయతీ నందు పీహెచ్ సిబ్బంది 50 మంది పనిచేస్తుండగా 30 మందిని మాత్రమే ఆప్కాస్ నందు నమోదు చేశారని మిగిలిన 20 మందిని కూడా ఆప్కాసులో నమోదు చేయాలన్నారు. చింతలపూడి నగర పంచాయతీగా అభివృద్ధి చెందిన తరుణంలో జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ ధర్నా లో వెలగాడి అనురాధ, శ్రీరామ్ వెంకటయ్య,శ్రీరామ్ కోటయ్య మానుకొండ సర్వేశ్వరరావు, పొదిలి చిన్నయ్య, దాసరి సాయమ్మ,బొత్స రాజేష్,బొత్స మౌనిక,శ్రీరామ్ పార్వతి ఈశ్వర్, గంధం రాజేష్ పాల్గొన్నారు.




---

# రాష్ట్రంలో తుగ్లక్చే పరిపాలన వైఎస్ఆర్ ప్రభుత్వమే..

**- జనసేన జిల్లా నాయకులు వెల్లడి**




**తెలంగాణ వీణ/ఏలూరు రూరల్:** ప్రజల్ని నిలువు దోపిడి చేస్తున్నది ఈ వైసిపి ప్రభుత్వం అని జగన్ రెడ్డి జైలుకు తప్పించి ప్రజల మధ్యన తిరగడానికి పనికిరాడని విమర్శించిన రెడ్డి అప్పలనాయుడు..ఈ సందర్భంగా ఏలూరు పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్లో ఒక తుగ్లక్ పాలన కొనసాగుతుందని అనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు.. ఈరోజు సాధారణ పౌరులు గాని మానవులు గాని జీవించేటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో లేదు.. ఎందుకంటే వ్యక్తులపైన వ్యవస్థలపైన తెలియకుండా అనేక రూపాలలో ప్రజలపై బాదుడు మోపి ప్రజల నడ్డి విరగొట్టే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మూరు?డైన ముఖ్యమంత్రి పరిపాలనలో మనకు కనిపిస్తుంది.. దానికి నిదర్శనమే ఈరోజు వస్తున్న కరెంటు చార్జీలు.. 2021,22 సంవత్సరంలో హౌసులకు గాని షాపులకు గాని కొన్ని కోట్లల్లో రూపాయలు వసూలు చేశారు.. ఇవాళ చూస్తే చెరువుల మీద వాడకం లేకపోయినా జీరో యూనిట్లు వచ్చినప్పుడు కూడా 9000, 10000 కరెంట్ బిల్లు వాడకం అన్నట్టు చూపిస్తుంది ఈ పనికిమాలిన దొంగ ప్రభుత్వం.. వాహన చోదకులకు వాహన మిత్ర ఇచ్చి అధిక చార్జీలు వేసి ఆటోలు మీద వాళ్లని వేధించే పరిస్థితి అధికమైంది.. చార్జీలు ఫైన్లు అందనంత గా వేసి వేధిస్తున్నారు.. ఎవరైనా టూ వీలర్ మీద కుటుంబంతో ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు.. ఎటు నుంచి ఏ పోలీసులు వస్తారో అని అన్ని ఉన్నప్పటికీ ఫైన్లు వేస్తున్నారని వారు వాపోతున్నారు..టూ వీలర్ ఫోర్ వీలర్ మీద చార్జీలు అధికంగా మోపుతున్నారు.. పోలీసులు వాళ్ళ జీతాలకు మా మీద చార్జీలు వేసి అడ్డగోలుగా ఫైన్ వేసి ప్రభుత్వాన్ని మైంటైన్ చేసే ప్రక్రియ చూస్తున్నాం.. ఈరోజు చూస్తే సాయంత్రం 6 గంటలకు ఏదైతే సమస్యలు ఉంటాయో ఎవ్వరికి తెలియకుండా దానిమీద రూపాయి చార్జీలు ఫోర్ వీలర్ మీద లీటర్ చొప్పున ఒక రూపాయి రోడ్డు మరమ్మతు చార్జీలు అని చెప్పి వసూలు చేసుకుంటుంది ఈ వైసీపీ ప్రభుత్వం.. ఏ విషయం లో కూడా రాష్ట్ర ప్రజలు సురక్షితంగా లేరు..ప్రజలు ఎప్పుడు దేహి అన్నట్టుగా ఉండాలన్న పాలన మీద జగన్మోహన్ రెడ్డి ఈ యొక్క అన్యాయాలు పెరిగిపోయాయి.. వాళ్లకు ఉన్న ఈ 60 రోజుల్లో ప్రతి పేదవాళ్ళను ఆదుకోవాలి.. ఒకవైపు సబ్సిడీలు వ్యవసాయ రంగాలు.. ఎరువులు సకాలంలో అందించలేని పరిస్థితి తలెత్తింది.. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలుగా కూడా ఈ రాష్ట్రం అన్ని వ్యాపార సంస్థలు మూతలు పడేటట్టు ఉంది.. ఈ రోజున ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఎస్ పి వి సి అనే పేరుతో 7000 రూపాయలు అడ్డంగా తీసుకుంటున్నారు.. ఇది ప్రక్రియ ప్రతి చోట జరుగుతుందని, భయంకరమైన దోపిడీ వ్యవస్థను ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ మెంట్ అనుసరిస్తుంది.. ఎందుకంటే ప్రజలకు తెలియకుండా అనేక రూపాయలు ఫినాల్టిగా వేసేసి, కరెంట్ బిల్లు కట్టకపోతే మేము ఫీజు పీకేస్తామని బెదిరించి వసూలు చేస్తున్నారు..ఈరోజు సామాన్యమైన ప్రజలకి ఉపాధి కల్పించలేని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం.. ఒక నిత్యవసర రూపాలలోనూ ప్రజలను హింసించి మోసం చేసినటువంటి దిక్కుమాలిన ప్రభుత్వం ఈ వైసీపీ ప్రభు త్వం.. చరిత్రలో ఇలాంటి సీఎం మరెక్కడా లేదని జనాలు ఈయన్ని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. **త్వరలోనే ఏలూరులో పవన్ కళ్యాణ్ గారి రోడ్డు షో అనంతరం బహిరంగ సభ..** త్వరలో ఏలూరు లో జరగబోయే జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారి రోడ్ షో మరియు భారీ బహిరంగ సభకు సంబంధించి రూట్ మ్యాప్ మరియు సభ స్థలాన్ని గోదావరి జిల్లాల ఎలక్షన్ ప్రోగ్రామ్స్ కన్వీనర్ బి వి రాఘవయ్య చౌదరి గారితో కలిసి పరిశీలించిన ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు నారా శేషు మా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ 14వ తేదీ నుండి భీమవరం నర్సాపురం లో పర్యటించనున్నారు.. ఈనెల 17వ తేదీ వరకు సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తారు..జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి అభ్యర్థులుగా జనసేన పార్టీ తరపున పోటీ చేసే నియోజకవర్గాల్లో అభ్యర్థుల తరఫున త్వరలో ప్రచారం చేయబోతున్నారు.. దానిలో భాగంగానే త్వరలోనే ఏలూరులో పవన్ కళ్యాణ్ గారు పర్యటించనున్నారు.. మాకు వచ్చిన సమాచారం ప్రకారం రోడ్డు షో లో భాగంగా పవన్ కళ్యాణ్ గారు కైకలూరు మీదుగా గడియార స్తంభం, పాత బస్టాండ్ నుండి ఫైర్ స్టేషన్ సెంటర్, అశోక్ నగర్ పత్తేబాద మీదుగా డీమార్ట్ 12 పంపులు సెంటర్‌కి చేరుకుంటారు.. 12 పంపుల సెంటర్లో బహిరంగ సభ ఉంటుందని పార్టీ అధిష్టానానికి సూచించడం జరిగిందని తెలిపారు. అధిష్టానం షెడ్యూల్ వివరాలు త్వరలోనే ప్రకటిస్తా నన్నారు.మీడియా సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా,నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, ఫ్యాన్స్ ప్రెసిడెంట్ దోసపర్తి రాజు, కార్యదర్శులు కందుకూరి ఈశ్వరరావు, ఎట్రించి ధర్మేంద్ర, బొత్స మధు, కోశాధికారి పైడి లక్ష్మణరావు, మీడియా ఇంచార్జ్ జనసేన రవి, నాయకులు బోండా రాము నాయుడు, వీరంకి పండు, రెడ్డి గౌరీ శంకర్,నూకల సాయిలు పాల్గొన్నారు.

## ఇంగ్లండ్ బౌలర్ రెహాన్ అహ్మద్‌కు వీసా కష్టాలు



**రాజ్‌కోట్:** ఇంగ్లండ్ స్పిన్నర్ రెహాన్ అహ్మద్‌కు వీసా చిక్కులు ఎదురయ్యాయి. సింగిల్ ఎంట్రీ వీసాతో ఇండియాకు వచ్చిన రెహాన్.. రెండో టెస్టు ముగిసిన తర్వాత జట్టు సభ్యులతో కలిసి దుబాయ్ వెళ్లాడు. అయితే మూడో టెస్టు కోసం రాజ్‌కోట్ చేరుకున్న అతనికి అధికారులు ఎంట్రీ ఇవ్వలేదు. రెండవ, మూడవ టెస్టు మధ్య పది రోజుల గ్యాప్ ఉన్న కారణంగా ఇంగ్లండ్ క్రికెటర్లు సేద తీరేందుకు దుబాయ్ వెళ్లారు. ఇక రాజ్‌కోట్ చేరుకున్న రెహాన్‌కు వీసా ఎంట్రీ దక్కలేదు. దీంతో అతను మళ్లీ పేపర్‌వర్క్ చేయాల్సి వచ్చింది. దీనిపై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తక్షణమే స్పందించింది. రెహాన్‌కు ఎంట్రీ ఇవ్వలేదని, ఆ తర్వాత అధికారులు తాత్కాలిక వీసా జారీ చేసినట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది.

# షైనింగ్ స్టార్ త్రిష.. డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జట్టుకు ఎంపికైన భద్రాచలం క్రికెటర్

**- నిలకడగా రాణిస్తున్న భద్రాచలం క్రికెటర్**

పువ్వు పుట్టగానే పరిమళించింది అన్నట్లు పసిప్రాయంలోనే క్రికెట్‌ను అమితంగా ప్రేమించిన త్రిష అనతికాలంలోనే అత్యున్నత స్థాయికి చేరింది. తన సోదరున్ని స్ఫూర్తిగా తీసుకుంటూ క్రికెట్‌ను ఇష్టపడ్డ ఈ యువ ప్లేయర్ దేశవాళీ క్రికెట్‌లో తనదైన మార్క్‌తో దూసుకెళుతున్నది. హైదరాబాద్ మహిళల టీమ్‌లో కీలక ప్లేయర్‌గా ఎదిగిన త్రిష..భవిష్యత్‌లో భారత సీనియర్ జట్టుకు ఆడాలన్న పట్టుదలతో ముందుకెళుతున్నది. త్వరలో మొదలుకాబోతున్న డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్‌కు ఎంపికైన ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్ క్రికెటర్ ఆమె మాటల్లోనే..

### డబ్ల్యూపీఎల్‌కు ఎంపిక కావడంపై?

డబ్ల్యూపీఎల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. భారత స్టార్ క్రికెటర్లతో పాటు పలువురు విదేశీ ప్లేయర్లతో కలిసి ఆడేందుకు ఆసక్తితో ఎదురుచూస్తున్నాను. ఈ నెల 23 నుంచి బెంగళూరు వేదికగా డబ్ల్యూపీఎల్ మొదలవుతున్నది. డబ్ల్యూపీఎల్‌లో సత్తాచాటడం ద్వారా మరింత వెలుగులోకి వచ్చేందుకు ప్రయత్నిస్తాను.

### భవిష్యత్ లక్ష్యాలు ఏంటీ?

భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన విజన్‌తో ఉన్నాను. డబ్ల్యూపీఎల్‌లో సీనియర్ క్రికెటర్లతో కలిసి ఆడటం ద్వారా పరిణతి సాధించేందుకు ఆస్కారం లభిస్తుంది. రానున్న రోజుల్లో ఎలాగైనా జాతీయ జట్టుకు ఆడాలన్న పట్టుదలతో ఉన్నాను. ఇందుకోసం కష్టపడేందుకు సిద్ధంగా ఉన్నాను.

### కుటుంబ ప్రోత్సాహంపై?

ప్రస్తుతం నేను ఈ స్థాయిలో ఉండటానికి కుటుంబం ఇచ్చిన ప్రోత్సాహమే ప్రధాన కారణం. ఊహ తెలియని వయసులో అన్నయ్య క్రికెట్ ఆడటం చూసి ఆట పట్ల ఆకర్షణ పొందాను. అన్నయ్య ఆడగా లేనిది నేను ఎందుకు ఆడొద్దంటూ వచ్చిన ఆలోచనే ఇప్పుడు ఈ స్థాయిలో నిలబెట్టింది. చిన్నతనం నుంచి నాన్న కృష్ణారావు, అన్నయ్య రుత్విక్ ఇచ్చిన మద్దతు మరువలేనిది. వీరికి తోడు ఓవైపు ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న అమ్మ ఎప్పుడు అండగా ఉంటూనే వస్తుంది.



### కెరీర్ ఎలా మొదలైంది?

నేను పుట్టింది భద్రాచలంలో. కెరీర్ కోసం మేము హైదరాబాద్‌కు మకాం మార్చాం. తార్నాకలో ఉంటూ తొలుత కోచ్ శ్రీనివాస్ దగ్గర ఓనమాలు దిద్దాను. ఎనిమిదేండ్లకే కెరీర్ మొదలుపెట్టి 12 ఏండ్లకు హైదరాబాద్ టీమ్‌కు ఎంపికయ్యాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు అండర్-16, 19, 23 వయసు విభాగాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ ఉన్నాను. ప్రస్తుతం లింగంపల్లిలో కోచ్ సలాం బయాష్ దగ్గర ట్రైనింగ్ తీసుకుంటున్నాను. టెక్నిక్ పరంగా మరింత మెరుగయ్యేందుకు ప్రయత్నిస్తున్నాను. దీనికి తోడు భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ దగ్గర ఫిట్‌నెస్ పరంగా శిక్షణ తీసుకుంటున్నాను. మొత్తంగా రోజుకు ఏడు, ఎనిమిది గంటలు ప్రాక్టీస్‌లో నిమగ్నమవుతాను. ప్రస్తుతమున్న పోటీ వాతావరణాన్ని ఎదుర్కొనేందుకు అన్ని రకాలుగా ముందుండాలి. అప్పుడే మరో స్థాయికి ఎదుగుతామన్నది నా నమ్మకం.

## జాతీయ స్కూల్‌గేమ్స్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో వర్షకు కాంస్యం

**- జాతీయ స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్**



**హైదరాబాద్, ఆట ప్రతినిధి:** రాంచీ వేదికగా జరుగుతున్న 67వ జాతీయ స్కూల్‌గేమ్స్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ సైక్లిస్ట్ వర్షారెడ్డి కాంస్య పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన బాలికల అండర్-17 20కి.మీ రోడ్ రేసులో బరిలోకి దిగిన వర్షారెడ్డి 38.00.45 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడ్డ అసవరీ (మహారాష్ట్ర), తబిత (తమిళనాడు) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు.


## రోహన్ బొప్పన్నకు రూ.50 లక్షల క్యాష్ ప్రైజ్



**బెంగుళూరు:** ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిల్ గెలిచిన రోహన్ బొప్పన్నకు కర్నాటక సీఎం సిద్ధరామయ్య భారీ నగదు నజరానా ప్రకటించారు. రూ.50 లక్షల క్యాష్ ప్రైజ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచిన అతనికి సీఎం సిద్ధరామయ్య కంగ్రాట్స్ తెలిపారు. బొప్పన్నను తన కుటుంబసభ్యుల మధ్యే సత్కరించారు. ఐటీశాక మంత్రి ప్రియాంకా ఖర్గే, మంత్రి శివరాజ్ తంగదై కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెన్స్ డబుల్స్ కేటగిరీలో గ్రాండ్ స్లామ్ టైటిల్ గెలిచిన మూడవ ఇండియన్‌గా బొప్పన్న నిలిచాడు. గతంలో భారత టెన్నిస్ ఆటగాళ్లలో లియాండర్ పేస్, మహేష్ భూపతి మాత్రమే మెన్స్ డబుల్స్‌లో టైటిల్స్‌ను సొంతం చేసుకున్నారు. ఇక మహిళల కేటగిరీలో సానియా మీర్జా డబుల్స్ టైటిల్ గెలిచిన విషయం తెలిసిందే. బొప్పన్న తన కేరీర్‌లో రెండు గ్రాండ్ స్లామ్ టైటిలను కైవసం చేసుకున్నాడు. అతను ఫ్రెంచ్ ఓపెన్ కూడా గెలిచాడు.

## ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు రాహుల్ దూరం.. గాయం నుంచి కోలుకోని సీనియర్ బ్యాటర్

**రాజ్‌కోట్:** ఇంగ్లండ్‌తో జరగనున్న మూడో టెస్టుకు సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ దూరమయ్యాడు. గాయం నుంచి రాహుల్ ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని తప్పిస్తున్నట్లు బీసీసీఐ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అతడి స్థానంలో కర్ణాటకకే చెందిన లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌ను జట్టుకు ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టు వైజాగ్ మ్యాచ్‌కు దూరమైన రాహుల్ బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాసం పొందాడు. దీంతో మిగిలిన మూడు టెస్టుల కోసం సెలెక్షన్ కమిటీ రాహుల్‌ను ఎంపిక చేసింది. అయితే మ్యాచ్ ఆరంభానికి మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండగా.. రాహుల్ 90 శాతం మాత్రమే కోలుకోవడంతో అతడిని తప్పించారు. 'రాజ్‌కోట్ టెస్టుకు రాహుల్ దూరమయ్యాడు.ప్రస్తుతం 90 శాతం కోలుకున్న అతడిని బీసీసీఐ వైద్య బృందం పర్యవేక్షిస్తున్నది' అని బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. సీనియర్లు పుజారా, రహానే జట్టుకు దూరం కాగా.. కోహ్లి ఈ సిరీస్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. శ్రేయస్ అయ్యర్ కూడా మిగిలిన మూడు మ్యాచ్‌లకు ఎంపిక కాలేదు. ఇప్పుడు రాహుల్ కూడా లేకపోవడంతో.. మిడిలార్డర్‌లో అనుభవరాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. మరోవైపు వికెట్ కీపర్ బ్యాటర్, తెలుగు ఆటగాడు శ్రీకర్ భరత్ స్థానంలో మూడు టెస్టులో ధ్రువ్ జురెల్ ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సర్ఫారాజ్ ఖాన్ రాజ్‌కోట్‌లో అరంగేట్రం చేయడం లాంఛనమే!



## ఆఖరి మ్యాచ్‌లో అరుదైన ఘనత సాధించిన వార్నర్ భాయ్.. ఆసీస్ నుంచి ఒకే ఒక్కడు..

ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ సొంతగడ్డపై ఆడిన ఆఖరి ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం పెర్త్ వేదికగా ముగిసిన ఆఖరి టీ20లో 49 బంతుల్లోనే 81 పరుగులు చేసిన వార్నర్.. పొట్టి ఫార్మాట్‌లో 12 వేల పరుగులు పూర్తిచేసిన తొలి ఆస్ట్రేలియా క్రికెటర్‌గా నిలిచాడు. జాతీయ జట్టుతో పాటు పలు లీగ్స్‌లో టీ20 మ్యాచ్‌లు ఆడుతున్న వార్నర్.. మూడో టీ20కి ముందు 48 పరుగుల దూరంలో ఉన్నాడు. కానీ ఈ మ్యాచ్‌లో 81 పరుగులు చేయడంతో అతడు 12వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. పొట్టి క్రికెట్‌లో 12వేల పరుగులు పూర్తిచేసుకున్నవారిలో ఓవరాల్‌గా ఐదో స్థానంలో ఉన్న వార్నర్.. ఆస్ట్రేలియా నుంచి మాత్రం ఈ ఘనత అందుకున్న తొలి క్రికెటర్‌గా రికార్డులెకెక్కాడు. ఈ జాబితాలో క్రిస్ గేల్, షోయభ్ మాలిక్, కీరన్ పొలార్డ్, అలెక్స్ హేల్స్‌లు వార్నర్ కంటే ముందున్నాడు. ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 12 వేల పరుగుల మైలురాయిని అందుకున్న రెండో క్రికెటర్ వార్నర్. క్రిస్ గేల్ 343 మ్యాచ్‌లలో ఈ ఘనత అందుకోగా వార్నర్ 368 మ్యాచ్‌లలో చేశాడు. అలెక్స్ హేల్స్ (435 మ్యాచ్‌లు), షోయభ్ మాలిక్ (486)లు తర్వాతి స్థానాల్లో ఉన్నారు.




## అవి ఆడకుంటే ఐపీఎల్‌లోనూ ఆడనిచ్చేదే లేదు..! బీసీసీఐ మరో షాక్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మెరిసి తద్వారా జాతీయ జట్టులోకి ఎంట్రీ ఇచ్చాక ఈ రెండింటికే అధిక ప్రాధాన్యమిస్తూ దేశవాళీ క్రికెట్‌ను పక్కనబెడుతున్న పలువురు క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ షాకివ్వనుందా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. జట్టు నుంచి పలు కారణాల వల్ల సిరీస్‌ల నుంచి తప్పుకుంటున్న ఆటగాళ్లు (ప్రస్తుతం నేషనల్ టీమ్‌తో ఉన్నవారు, ఎన్‌సీఎలో ఉన్న సభ్యులు మినహా) తిరిగి జాతీయ జట్టులోకి రావాలంటే తప్పకుండా దేశవాళీ ఆడాలని నిబంధనను విధించిన బీసీసీఐ.. తాజాగా మరో షాకివ్వనుందట. రంజీలను పక్కనబెడుతున్న క్రికెటర్లకు ఐపీఎల్‌లో ఆడే ఛాన్స్‌తో పాటు వేలంలో కూడా అనర్హత వేటు వేయనున్నట్టు తెలుస్తున్నది. ఇదే విషయమై బీసీసీఐ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ కొంతమంది క్రికెటర్లు ఆడేందుకు ఫిట్‌నెస్ ఉన్నా రంజీలను ఆడటం లేదు. ఒకవేళ వాళ్లు జాతీయ జట్టుకు దూరమైతే సయ్యిద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్) వంటి టోర్నీలలో టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడుతున్నారు.

## భారత ఓల్డెస్ట్ మాజీ క్రికెటర్ కన్నుమూత..

భారత మాజీ క్రికెటర్ దత్తాజీరావు గైక్వాడ్(95) అనారోగ్యంతో మంగళవారం ఉదయం కన్నుమూశారు. టీమిండియా తరుపున గైక్వాడ్ 11 టెస్టు మ్యాచ్‌లలో ఆడారు. 1928, అక్టోబర్ 27న ఆయన జన్మించారు. భారత మాజీ ఓపెనర్, జాతీయ కోచ్ ఔన్షుమాన్ గైక్వాడ్, దత్తాజీరావు గైక్వాడ్ కుమారుడే.కాగా, 1952, 1959లో ఇంగ్లాండ్, 1952-53లో వెస్టిండీస్‌లో పర్యటించిన భారత జట్టులో గైక్వాడ్ సభ్యుడిగా ఉన్నారు. ఆ తర్వాత 1959 పర్యటనలో టీమిండియాకు కెప్టెన్‌గానూ ఆయన వ్యవహరించాడు. 11 టెస్టు మ్యాచ్ లలో అత్యధికంగా అతడు 52 పరుగులు చేసి ఏకైక హాఫ్ సెంచరీ అతడి ఖాతాలో ఉంది. రంజీ ట్రోఫీలో మాత్రం 14 సెంచరీలతో 3139 పరుగులు చేశాడు. 1959లో మహారాష్ట్రపై జరిగిన రంజీ మ్యాచ్‌లో 249 పరుగులు చేసి డబుల్ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 25 వికెట్లు తీశాడు. దత్తా గైక్వాడ్ కుమారుడు అంశుమన్ గైక్వాడ్ కూడా టీమిండియా జట్టుకు ఓపెనర్‌గా ఆడాడు.





# జపాన్‌లో అమీర్ ఖాన్ కొడుకుతో సాయి పల్లవి ప్రేమాయణం..




బాలీవుడ్ స్టార్ హీరో అమీర్‌ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో టాలీవుడ్ స్టార్ నటి సాయి పల్లవి కథనాయికగా నటిస్తుంది. ప్రేమకథతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సునీల్‌పాండే దర్శకత్వం వహించబోతున్నాడు. యశ్‌రాజ్ ఫిలింస్ బ్యానర్‌లో వస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం జపాన్‌లో షూటింగ్ జరుపుకుంటుంది.జపాన్‌లో ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో సపోరో స్నో ఫెస్టివల్ జరుగుతుందన్న విషయం తెలిసిందే. ఈ ఫెస్టివల్‌ను చూడటానికి ప్రపంచం నలుమూలల నుండి పర్యాటకులు జపాన్‌కు వస్తుంటారు. అయితే ఈ ఫెస్టివల్‌లోనే సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే షూటింగ్‌లో బ్రేక్ వచ్చిన అనంతరం జునైద్ ఖాన్ – సాయి పల్లవి సపోరో స్నో ఫెస్టివల్‌లో సందడి చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. లవ్ స్టోరీ కాన్సెప్ట్ తో తెరకెక్కుతున్న సినిమాను ఈ ఏడాది చివర్లో రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఇదిలావుండగా.. సాయి పల్లవి మరోవైపు తెలుగులో నాగచైతన్యతో కలిసి తండేల్ సినిమా చేస్తుంది. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నఈ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతుంది. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్ కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. మరీ ముఖ్యంగా గ్లింప్స్ చివర్లో పల్లెటూరి పదహారాణాల తెలుగు అమ్మాయిగా సాయి పల్లవి కనిపించి యూత్ ను సంబురాల్లో మునిగిపోయేలా చేసింది. ఇదికాకుండా తమిళంలో శివకార్తికేయన్ తో కలిసి యాక్షన్ డ్రామా సినిమా చేస్తుంది. రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తున్నాడు.

# ‘శ్రీ ఆంజనేయం’ సినిమా ఫ్లాప్ అవ్వడానికి కారణం ఆడియన్స్ కాదు : కృష్ణవంశీ




టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ ‘హనుమాన్’. తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టిస్తుంది. ఇప్పటివరకు ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే తాజాగా ఈ సినిమా చూసిన ఓ నెటిజన్ తనకు ‘హనుమాన్’ కంటే లెజెండరీ దర్శకుడు కృష్ణవంశీ తీసిన ‘శ్రీ ఆంజనేయం’ బాగా నచ్చింది. ఎందుకో తెలీదు కానీ ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది అని నెటిజన్ ట్వీట్ చేశాడు. అయితే ఈ ట్వీట్‌పై తాజాగా కృష్ణవంశీ ఎక్స్ వేదికగా రిప్లయ్ ఇచ్చాడు.‘శ్రీ ఆంజనేయం’ సినిమా ఫ్లాప్ అవ్వడం విషయంలో ఆడియన్స్ ఎప్పుడూ తప్పు చేయలేదు.. వారికి సినిమా నచ్చలేదు అంటే ఏదో పొరపాటు జరిగి ఉండొచ్చు లేదా ఆ సినిమా చేరువకావడంలో సమస్య ఉండి ఉండవచ్చు. అందుకే ఆడియన్స్‌ను నిందించొద్దు. కొన్ని అంశాల విషయంలో నేను తప్పు చేసి ఉండవచ్చు అంటూ కృష్ణవంశీ రాసుకొచ్చాడు. కాగా ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన ‘శ్రీ ఆంజనేయం’ 2004లో విడుదలై బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా మిగిలింది. ఇక ఈ సినిమాలో హనుమంతుడిగా ప్రముఖ నటుడు అర్జున్, హనుమాన్ భక్తుడు అంజిగా నితిన్ నటించారు.

## తండ్రీకొడుకుల సెంటిమెంట్‌తో ధనరాజ్ ‘రామం రాఘవం’.. గ్లింప్స్ వచ్చేది ఆరోజే.!





కోలీవుడ్ దర్శకుడు, నటుడు సముద్రఖని ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘రామం రాఘవంస. ఈ సినిమాతో టాలీవుడ్ నటుడు ధనరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్ పై ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పొలవరపు నిర్మిస్తున్నాడు. తండ్రీకొడుకుల సెంటిమెంట్ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటకే ఫస్ట్ లుక్ విడుదల చేయగా.. మంచి స్పందన లభించింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ గ్లింప్స్ అప్‌డేట్ ఇచ్చారు.ఈ మూవీ గ్లింప్స్‌ను ప్రేమికుల రోజు కానుకగా రేపు ఉదయం 11.11 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. మోక్ష, హరీష్ ఉత్తమన్, సత్య పృధ్వి, శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను, ప్రమోదిని, రాకెట్ రాఘవ, రచ్చ రవి, ఇంటూరి వాసు, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి విమానం చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల కథ ను సమకూర్చగా అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నాడు, మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్. దుర్గా ప్రసాద్ ఈ సినిమాకు కెమెరామెన్. హైదరాబాద్, చెన్నై, అమలాపురం, రాజమండ్రి, రాజోలు, పరిసర ప్రాంతాల్లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ‘రామం రాఘవం’ తమిళ తెలుగు భాషలలో ఒకేసారి విడుదల కానుంది.

# ఊ అంటావాకు మించేలా.. పుష్ప–2లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దిశా పటానీతో ఐటమ్ సాంగ్



ఈ మధ్య వచ్చిన ఐటమ్ సాంగ్స్‌లో ది బెస్ట్ అంటే.. ‘పుష్ప’లోని ‘ఊ అంటావా మావా.. ఉ..ఉ.. అంటావా మావా..’ పాటే అనాలి. ఆ పాటలో సమంత స్క్రీన్ ప్రెజెన్స్ మామూలుగా ఉండదు. తన అందంతో అభినయంతో యువతరాన్ని ఉర్రూత లూగించింది. సమంత. దేవిశ్రీ సంగీతం, ఇంద్రావతి స్వరం, చంద్రబోస్ సాహిత్యం ఈ పాటను మరోస్థాయికి తీసుకెళ్లాయని చెప్పాలి.మరి ఆనవాయితీ ప్రకారం ‘పుష్ప2’లో కూడా ఇలాంటి ఐంటమ్ నంబర్ ఒకటి ఉండాలికదా. అది కూడా తొలి పార్ట్‌లోని ఐటమ్‌నంబర్‌కి ఏ మాత్రం తగ్గని స్థాయిలో ఉండాలి. అందుకే దిశా పటానీని ఎంపిక చేశారు సుకుమార్. తొలి పార్ట్‌లోని పాటను మించేలా అద్భుతమైన గీతాన్ని దేవిశ్రీ స్వరపరిచినట్టు విశ్వసనీయ సమాచారం.ఈ వారంలోనే దిశాతో ఐటమ్‌సాంగ్ చిత్రీకరించనున్నారు సుకుమార్. ఇక దిశా పటానీ విషయానికొస్తే.. ఆమె తొలి సినిమా పూరీజగన్నాథ్ ‘లోఫర్’. ఆ సినిమా తర్వాత బాలీవుడ్‌లో ఎం.ఎస్.ధోనీ, బాగీ2, బాగీ3, ఏక్ విలన్ రిటర్న్స్ తదితర చిత్రాల్లో నటించి అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. త్వరలో విడుదల కానున్న ప్రభాస్ ‘కల్కి 2898 ఏ.డి’, సూర్య ‘కంగువ’ చిత్రాల్లో కూడా మంచి పాత్రలు పోషిస్తున్న దిశా పటానీ.

## అక్షయ్ కుమార్ హీరోగా ‘ఆకాశం నీ హద్దురా’ హిందీ రీమేక్.. రిలీజ్ డేట్ ఫిక్స్.!




కోలీవుడ్ హీరో సూర్య, స్టార్ దర్శకురాలు సుధా కొంగర కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆకాశం నీ హద్దురా నవంబర్ 12న నేరుగా ఓటీటీలోకి విడుదలైన ఈ చిత్రం సంచలన విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమాను సుధా కొంగరా హిందీలో రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. సూర్య పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటిస్తుండగా.. ‘సాఫీరా’ అనే టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుండగా.. మూవీ నుంచి మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ ఇచ్చారు.ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా జూలై 12న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించారు. కేప్ ఆఫ్ గుడ్ ఫిల్మ్స్, 2డి ఎంటర్‌టైన్‌మెంట్, అబండంటియా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై అరుణా భాటియా, సూర్య, జ్యోతిక, విక్రమ్ మల్హోత్రా ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తుండగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

## యూట్యూబ్‌ను పేల్చడానికి సిద్ధంగా ఉండండి.. ‘టిల్లు 2’ ట్రైలర్ వచ్చేస్తుంది

టాలీవుడ్ నటుడు సిద్దు జొన్నలగడ్డ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం టిల్లు 2. 2022లో వచ్చిన బ్లాక్ బస్టర్ డిజే టిల్లు సినిమాకు ఈ చిత్రం సీక్వెల్‌గా వస్తుంది. ఇక ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. నరుడా డోనరుడా ఫేం మల్లిక్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీని సితార ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన గ్లింప్స్‌తో పాటు ఫస్ట్ సింగిల్ టికెటే కొనకుండా పాటకు మంచి స్పందన వచ్చింది.ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ట్రైలర్‌ను ప్రేమికులరోజు సందర్భంగా ఈ నెల 14న ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.




రిపోర్టర్లు కావలెను

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
S9 TV తెలుగు

తెలుగు లో రాయగల సమర్ధత ,
సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ వీణ తెలుగు దినపత్రిక
మీకు సరైన వేదిక

అన్నీ జిల్లాలు , మండలాలు, నియోజకవర్గాల పరిధిలో
పని చేసేందుకు అవకాశం కలిపిస్తోంది.

వివరాల కొరకు సంప్రదించల్సిన ఫోన్ నెంబర్ లు
email: telanganaveenaofficial@gmail.com
Website: https://telanganaveena.com/
91 90525 22626
91 98485 99616



Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part  Without Written